

## బంగ్లా 21 ఏండ్ల తర్వాత..

బంగ్లాదేశ్ కొత్త చరిత్ర లిఖించింది. తమ సొంత ఇలాఖాలో ఆస్ట్రేలియాను మట్టికరిపించి వన్డేల్లో 21 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది. మంగళవారం వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో బంగ్లా 86 పరుగుల తేడాతో (డక్‌వర్త్ లూయిస్) ఆసీస్‌పై చారిత్రక విజయం సాధించింది. వన్డేల్లో చివరిసారి 2005లో ఆసీస్‌పై గెలిచిన బంగ్లా ఇన్నేండ్లకు మళ్లీ ఆ జట్టును ఓడించింది. తొలుత మొసాదెక్ హుస్సేన్(70 బంతుల్లో 7ఫోర్లు, 3సిక్సర్లతో 86 నాటౌట్)కు తోడు నజ్ముల్ హుస్సేన్ శాంటో (67), తంజిద్ హసన్ (54) అర్ధసెంచరీలతో బంగ్లా 50 ఓవర్లలో 284/8 స్కోరు చేసింది.


# చట్టం

సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

నిజామాబాద్
బుధవారం
10.06.2026

సంపుటి : 16 సంచిక: 255
పేజీలు:6 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్


# మహిళల చేతుల్లోనే తెలంగాణ ప్రగతి

- మహిళా శక్తి వారోత్సవాల ముగింపు సభలో సీఎం కీలక వ్యాఖ్యలు
- మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ
- ఉచిత బస్సు పథకంపై విమర్శలకు సీఎం కౌంటర్
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యమన్న రేవంత్



**చట్టం, స్టేట్ బ్యూరో:**

ఆడబిడ్డలను లక్ష్మీదేవిగా కొలిచే సంస్కృతి మనదని, భూమిని భూమాతగా, దేశాన్ని భారతమాతగా, రాష్ట్రాన్ని తెలంగాణ తల్లిగా భావించి గౌరవించుకునే గొప్ప సాంప్రదాయం మనదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'మహిళా శక్తి వారోత్సవాల' ముగింపు సభలో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి వీరనారీమణులు తెలంగాణ కీర్తిని ప్రపంచానికి చాటారని గుర్తుచేశారు. దేశంలో మహిళలకు ఓటు హక్కు కల్పించి, వారి చేతికి అధికారం ఇచ్చిన ఘనత జవహర్‌లాల్ నెహ్రూదేనని, కాంగ్రెస్ పార్టీయే మహిళలకు రాష్ట్రపతిగా, కేంద్ర మంత్రులుగా అవకాశాలు కల్పించిందని స్పష్టం చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని 2013లోనే సోనియా గాంధీ పార్లమెంట్‌లో బిల్లు పెట్టారని, రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో మహిళలు ప్రధాన పాత్ర పోషించబోతున్నారని తెలిపారు. ఇదే సమయంలో విపక్షాలపై విమర్శలు గుప్పిస్తూ.. గత ప్రభుత్వం మొదటి ఐదేళ్లు ఒక్క మహిళకు కూడా మంత్రిగా అవకాశం కల్పించలేదని, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఏనాడూ తమ పార్టీ అధ్యక్షుడిగా మహిళను నియమించలేదని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇవ్వాల్సిన సున్నా వడ్డీ రుణాలను కూడా ఎగ్గొట్టిందని, కానీ తమ ప్రజా ప్రభుత్వం రాగానే ఆ బకాయిలను మంజూరు చేసిందని సీఎం తెలిపారు. తాము ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకంపై కొందరు కడుపు నిండా విషం నింపుకుని, కళ్లల్లో నిప్పులు పోసుకుంటూ రద్దు చేయాలని రోడ్డెక్కారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా వెనక్కి తగ్గకుండా ఉచిత బస్సు సౌకర్యాన్ని కొనసాగిస్తున్నామని, దీనివల్ల వేలాది మంది ఆడబిడ్డలు ఉన్నత చదువులు చదువుకోగలుగుతున్నారని చెప్పారు. వాతావరణ శాఖ ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉంటుందని హెచ్చరించినప్పటికీ, తాము మహిళా సంఘాల కోసం 553 సరికొత్త బస్సులను ప్రారంభించగానే వరుణదేవుడు కరుణించి వర్షాలు కురిపించాడంటూ సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మహిళలను కేవలం చిన్న చిన్న పనులకే పరిమితం చేయకుండా.. అదానీ వంటి బడా పారిశ్రామికవేత్తలతో పోటీ పడేలా 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. అలాగే పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టుపనిని కూడా వారికే ఇచ్చామన్నారు. కార్పొరేట్ ఆఫీసులకు దీటుగా 'ఇందిరా మహిళా భవనాలను' నిర్మిస్తున్నామని, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ఐటీ హబ్ అయిన హైటెక్ సిటీలో 106 ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈకామర్స్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో విక్రయించేలా గ్లోబల్ మార్కెట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణ ఆర్థిక ప్రగతి ఆడబిడ్డల చేతిలోనే ఉందని విశ్వసిస్తూ, రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల సంఖ్యను కోటి మందికి చేర్చడమే తమ లక్ష్యమని సీఎం పునరుద్ఘాటించారు. "ఈ వేదికగా నా ఆడబిడ్డలకు మాట ఇస్తున్నా.. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే పూర్తి బాధ్యత నాది" అని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. భవిష్యత్తులో మహిళా సంఘాలకు వెయ్యి కాదు.. ఏకంగా 3 వేల బస్సులు కొనిచ్చి వారిని యజమానులను చేస్తామన్నారు. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదంతో 2034 వరకు ఈ ప్రజా ప్రభుత్వాన్ని ఇలాగే విజయవంతంగా నడిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇదే తరుణంలో వ్యవసాయ రంగం గురించి ప్రస్తావిస్తూ.. రైతులు ఒకే రకమైన పంటలపై ఆధారపడకుండా, మార్కెట్ డిమాండ్‌ను బట్టి అన్ని రకాల పంటలు వేసేలా మహిళా సంఘాలు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# తొలకరి పలకరింపు

## ఉరుములు, మెరుపులతో నగరాన్ని ముంచెత్తిన వాన

### లోతట్టు ప్రాంతాలు, రన్ వేలు నీట మునిగాయి

### ప్రధాన కూడళ్లలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి

### జీహెచ్ఎంసీ సిబ్బంది రంగంలోకి దిగి నీటిని తీస్తున్నారు

### అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని అధికారుల సూచన

### మరికొన్నిరోజుల పాటు భారీ వర్ష సూచన ఉంది

**భాగ్యనగరంలో వరుణుడు భీభత్సం సృష్టించాడు. ఆకాశానికి చిల్లు పడిందా అనేలా కుండపోత వర్షం కురవడంతో ఒక్కసారిగా మహానగరం అతలాకుతలమైంది. మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా మారిన వాతావరణంతో నగరం చిమ్మచీకట్లను అమ్ముకుంది. నిమిషాల వ్యవధిలోనే ఉరుములు, మెరుపుల గర్జనలతో కూడిన భారీ వర్షం నగరాన్ని ముంచెత్తింది. దీంతో సాధారణ జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది.**

**చట్టం, స్టేట్ బ్యూరో:**



లోతట్టు ప్రాంతాలన్నీ క్షణాల్లో జలమయం కావడంతో అటు వాహనదారులు, ఇటు పాదచారులు నరకయాతన అనుభవించారు. ఊహించని ఈ వాన దెబ్బకు సిటీ రోడ్లన్నీ ఉధృతంగా ప్రవహించే నదులను తలపించాయి. కార్యాలయాల నుండి ఇళ్లకు తిరుగు ప్రయాణమైన ఉద్యోగులు వానలో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని దాదాపు అన్ని ప్రధాన కూడళ్లు, అంతర్గత రహదారులు వరద నీటితో చెరువులను తలపించాయి. పంజాగుట్ట, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ లాంటి విఐపి ప్రాంతాలతో పాటు యూసఫ్‌గూడ, టోలీచౌకి, ఫిలింనగర్ పరిసరాలు వరద ముంపునకు గురయ్యాయి. అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, ఎర్రగడ్డ, సనత్‌నగర్ ప్రధాన రహదారులపై మోకాళ్లోతు నీరు చేరింది. రోడ్లపై డ్రైనేజీలు పొంగిపొర్లడంతో కాలనీల రోడ్లు కాలువలుగా మారాయి. ఈ ఆకస్మిక వరద ధాటికి ద్విచక్ర వాహనాలు, కార్లు నీట మునిగిపోయాయి. ముఖ్యంగా కూడళ్ల వద్ద నీరు గంటల తరబడి నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన ప్రయాణికులు రోడ్లపైనే గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. మహానగరంలో ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలింది. ప్రధాన రహదారులపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఆఫీస్ వేళలు ముగిసి ఇళ్లకు వెళ్లే సమయంలో ఈ వర్షం పడటంతో ఐటి కారిడార్‌తో పాటు వ్యాపార సముదాయాలు ఉన్న ప్రాంతాలు భారీ ట్రాఫిక్ జామ్‌తో నరకాన్ని చూపించాయి. మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం ఐటి హబ్‌లలో ఐటి ఉద్యోగుల వాహనాలు అంగుళం కూడా కదల్లేని పరిస్థితి ఏర్పడింది. మెట్రో స్టేషన్లు సైతం ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. బస్సు స్టాండ్‌లు, ఫ్లైఓవర్ల కింద వానకు తడవకుండా వాహనాలను నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారింది. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి వాహనాలను క్రమబద్ధీకరించడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. లోతట్టు కాలనీల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. టోలీచౌకి పరిసర ప్రాంతాలలోని కాలనీలలోకి వరద నీరు ఇళ్లలోకి చేరింది. నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు నీట మునిగిపోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ప్రసిద్ధ వ్యాపార కేంద్రమైన అమీర్‌పేట్ పరిసరాల్లోని హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా నిండిపోవడంతో మురుగు నీరు, వర్షపు నీరు కలిసి రోడ్లపైకి ప్రవహించింది. దీంతో నగరంలో తీవ్రమైన దుర్వాసనతో కూడిన వాతావరణం ఏర్పడింది. కాలనీలలో నిలిచిన నీటిని తొలగించడానికి స్థానికులు రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చింది. ఈ భారీ విపత్తు నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం అత్యవసరంగా రంగంలోకి దిగింది. నగర మేయర్, కమిషనర్ ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలను నగరంలోని సున్నితమైన, లోతట్టు ప్రాంతాలకు తరలించారు. ప్రధాన రహదారులపై నిలిచిన నీటిని తొలగించడానికి మోటార్లను ఏర్పాటు చేశారు. మ్యాన్‌హోల్స్ తెరిచి ఉన్న ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నగరంలో నెలకొన్న అత్యవసర పరిస్థితుల దృష్ట్యా మున్సిపల్ అధికారులు ప్రజలకు కీలక సూచనలు జారీ చేశారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావద్దని హెచ్చరించారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని కోరారు. వర్షపు నీరు నిలిచిన రోడ్లపై ప్రయాణించేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్, గుంతల పట్ల వాహనదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలోకి వెళ్లవద్దని విద్యుత్ శాఖ అధికారులు హెచ్చరించారు. ఏ క్షణంలోనైనా విద్యుత్ వైర్లు తెగిపడే ప్రమాదం ఉన్నందున జాగ్రత్త వహించాలని కోరారు. వాతావరణ శాస్త్ర నిపుణులు నగర ప్రజలకు మరికొంత కాలం వాన గండం పొంచి ఉందని స్పష్టం చేశారు. రాగల 24 గంటల పాటు నగరంలో మోస్తరు నుండి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం రెడ్ అలర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నగరవ్యాప్తంగా గాలుల తీవ్రత కూడా ఎక్కువగా ఉంటుందని అంచనా వేశారు. గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. నగరంలోని పాత కట్టడాలు, బలహీనమైన గోడలు ఉన్న ప్రాంతాల ప్రజలను ముందస్తుగా ఖాళీ చేయిస్తున్నారు. ఈ భారీ వర్షాల ప్రభావం నగరంలోని విద్యాసంస్థలపై తీవ్రంగా పడింది. రేపటి రోజున కూడా భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు అధికారులు ముందస్తు సెలవు ప్రకటించే యోచనలో ఉన్నారు. అనేక ఐటి కంపెనీలు తమ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ సదుపాయాన్ని కల్పించాలని ఐటి అసోసియేషన్లు కోరాయి. రవాణా వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడంతో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ, క్యాబ్ సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. అత్యవసర సేవల విభాగాలైన వైద్య, ఆరోగ్య, మున్సిపల్ శాఖల సిబ్బంది సెలవులను రద్దు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నగరం ఎదుర్కొంటున్న ఈ విపత్కర పరిస్థితిపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి నేరుగా జిల్లా కలెక్టర్లు, జిహెచ్ఎంసి అధికారులతో ఫోన్ లైన్ ద్వారా సమీక్షలు జరుగుతున్నాయి. నగరంలోని హుస్సేన్ సాగర్, మీర్ ఆలం ట్యాంక్ వంటి ప్రధాన జలాశయాల నీటి మట్టాలను నీటి పారుదల శాఖ అధికారులు ప్రతి గంటకు లెక్కిస్తున్నారు. సాగర్ అదనపు నీటిని మూసి నదిలోకి వదిలేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మూసి నదీ పరివాహక ప్రాంత ప్రజలను అలర్ట్ చేశారు. రాబోయే రెండు రోజులు నగరానికి అత్యంత కీలకమైనవని, ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణతో, అప్రమత్తంగా ఉండి ప్రభుత్వానికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# మరోసారి రెచ్చిపోయిన నేపాలి గ్యాంగ్

## భారీగా బంగారం, వెండి, వజ్రాభరణాలు లూటీ.!

**చట్టం, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్‌లో మరోసారి నేపాలి గ్యాంగ్ కలకలం సృష్టించింది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని హిల్ రిడ్జ్ విల్లాస్‌లో జరిగిన భారీ చోరీ నగరంలో సంచలనం సృష్టించింది. ఓ ప్రముఖ వ్యాపారవేత్త ఇంట్లో పనిచేస్తున్న నేపాలి దంపతులు కోట్ల రూపాయల విలువైన బంగారం, వెండి, వజ్రాభరణాలు, నగదుతో పరారైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. హిల్ రిడ్జ్ విల్లాస్‌లో నివాసం ఉంటున్న వ్యాపారవేత్త ప్రకాష్ ఇంట్లో నెల రోజుల క్రితమే నేపాల్‌కు చెందిన కమల్, విమలా దంపతులు పనికి చేరారు. వ్యాపార అవసరాల నిమిత్తం ప్రకాష్ కొద్ది రోజుల క్రితం ముంబైకి వెళ్లగా, కుటుంబ సభ్యులు కూడా ఇంట్లో లేకపోవడంతో ఈ దంపతులు పరిస్థితిని అనుకూలంగా మార్చుకున్నారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో ప్రకాష్ కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకోగా.. ఇంట్లో పనిచేస్తున్న నేపాలి దంపతులు కనిపించలేదు. అదే సమయంలో ఇంట్లోని రెండు చోట్ల భద్రపరిచిన బంగారు ఆభరణాలు, నగదు, వెండి వస్తువులు, వజ్రాలు, వజ్రాభరణాలు మాయమైనట్లు గుర్తించారు. పూజా గదిలోని విగ్రహానికి అలంకరించిన బంగారు గొలుసుతో పాటు ఇతర విలువైన వస్తువులు కూడా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీని స్వాధీనం చేసుకుని విచారణ ప్రారంభించారు. ప్రాథమిక ఆధారాల ప్రకారం.. చోరీకి పాల్పడిన నేపాలి దంపతులే నగలతో పరారైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు 6 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీటిలో నాలుగు బృందాలను నేపాల్ సరిహద్దు ప్రాంతాలకు పంపినట్లు సమాచారం. మరోవైపు ఈ దంపతులను ఉద్యోగంలోకి తీసుకువచ్చిన వ్యక్తులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. చోరీకి గురైన బంగారం, వజ్రాభరణాలు, నగదు విలువపై ఇంకా స్పష్టత రాలేదని, పూర్తి లెక్కలు తేలిన తర్వాత అధికారికంగా వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, పరారీలో ఉన్న దంపతులను త్వరలోనే పట్టుకుంటామని అధికారులు పేర్కొన్నారు.






## రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల సరుకులు ఇవ్వాల్సిందే..

**చట్టం, స్టేట్ బ్యూరో:**

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులను అందించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయం ఎదుట ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆర్. అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మల్లు లక్ష్మి మాట్లాడుతూ, 2014 ఎన్నికల సమయంలో బీజేపీ అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ధరల పెరుగుదలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు, పాఠశాల ఫీజులు నిరంతరం పెరుగుతున్నాయని, దీంతో సామాన్య ప్రజల జీవనం మరింత భారంగా మారిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదల కారణంగా కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1 కోటి 5 లక్షల 42 వేల 188 బీపీఎల్ రేషన్ కార్డులు ఉన్నాయని, వాటి పరిధిలో 3 కోట్ల 39 లక్షల 96 వేల 239 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి వ్యక్తికి ఆరు కిలోల బియ్యం మాత్రమే అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆహార భద్రతను బలోపేతం చేయాలంటే బియ్యంతో పాటు పప్పులు, వంటనూనెలు, మొక్కజొన్నలు, చక్కెర, కారం, పసుపు, జీలకర్ర, పామాయిల్, కొబ్బరి నూనె, ఆవాలు, జొన్నలు, పల్లీలు, సబ్బులు వంటి మొత్తం 14 రకాల నిత్యావసర సరుకులను రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల అనేక కుటుంబాలు పోషకాహారాన్ని తీసుకోలేకపోతున్నాయని, ముఖ్యంగా మహిళల్లో రక్తహీనత సమస్య అధికమవుతోందని మల్లు లక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు.

## గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేసిందేమీ లేదు

- అశ్వారావుపేటలో అభివృద్ధి పనుల ప్రారంభం
- 25 లక్షల రైతులకు రుణమాఫీ: మంత్రి
- 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్

**చట్టం, స్టేట్ బ్యూరో:**



గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదవాడి ఆశలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో పలు అభివృద్ధి పనులను ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతును రాజును చేయాలనే లక్ష్యంతో ఇప్పటికే 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశామని, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత విద్యుత్, డైట్ ఛార్జీల పెంపు వంటి నిర్ణయాలతో ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. పేదవాడి ఆత్మగౌరవం కోసం రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, అందులో కేవలం అశ్వారావుపేట నియోజకవర్గానికే నాలుగు వేల ఇళ్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. చివరి పేదవాడి వరకూ లబ్ధి చేకూరుస్తామని చెప్తూ, భూమి లేని పేద ఆడబిడ్డల కోసం ఐదెకరాల్లో G+3 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. నాడు కేవలం పింక్ కలర్ పార్టీ వారికి మాత్రమే అందిన లబ్ధి, నేడు ప్రతి పేదవాడికి చేరుతోందని విమర్శించారు. విద్యా వ్యవస్థలో మార్పుల గురించి ప్రస్తావిస్తూ అశ్వారావుపేటలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఇక్కడ కులమతాలకు, పేద ధనిక తారతమ్యం లేకుండా సుమారు 2300 మంది విద్యార్థులు చదువుకుంటారని చెప్పారు. దీనితో పాటు త్వరలోనే ఇక్కడ అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్‌ను కూడా తీసుకురానున్నట్లు ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అశ్వారావుపేటకు వంద పడకల ఆసుపత్రిని, నర్సింగ్ కాలేజీని మంజూరు చేసినట్లు మంత్రి గుర్తుచేశారు. స్థానికంగా కొమురం భీమ్ అర్బన్ పార్క్ ప్రారంభం, పూసుకుంట కొండ రెడ్ల కోసం నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ పేదవాడి ప్రభుత్వమని, భవిష్యత్తులో ప్రజలందరి ఆకాంక్షలను నెరవేరుస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు , పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

## పిప్రి గ్రామంలో ఎమ్మెల్యే పర్యటన



**చట్టం ఆర్మూర్:** కాలిన ఇంట్లో ఎమ్మెల్యే హిందువులంతా ఏకం కాకపోతే పిప్రి మరో కాశ్మీర్ అవుతుందని పదివేల హిందూ కుటుంబాలు ఉన్న పిప్రి లో ఒక ముస్లిం ఇంత అరాచకానికి దిగడం మరో కాశ్మీర్ అవడానికి నిదర్శనం అని అన్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో గత రెండు రోజుల క్రితం అప్పు ఇచ్చి తిరిగి అడిగినందుకు రాజమల్లు, ఇల్లుని నిప్పు పెట్టి దగ్ధం చేసిన సంఘటన జరగడంతో విషయం తెలుసుకున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, పిప్రి గ్రామానికి వెళ్లి ఇల్లును పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. హిందువులకు మగతనం ఉందా లేదా లేక నపుంసకులు అయ్యారా హిందువులు డబ్బు, బంగారం, బంగ్లాలు, కులం, కుంపట్లు పెట్టుకుంటూ రోజులు గడుపుతున్నారనీ మనపై ప్రయోగం చేశారాని ఇది అంతర్జాతీయ కుట్ర అని ఆరోపించారు. దీని వెనకాల పెద్ద పెద్ద వారి హస్తం ఉందని ఆర్మూర్ నియోజకవర్గంలో హిందువుల ఐక్యత పెరుగుతుంటే చూసి ఓర్వలేక కొన్ని శక్తులు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని అన్నారు. పదివేల కుటుంబాలు ఉన్న గ్రామంలో ఒక తీవ్రవాది అంతర్జాతీయ సంస్థలతో సంబంధం ఉన్న ముస్లిం నా కొడుకు ఇంట్లో కుటుంబం మొత్తం ఉండగా ఇంట్లోకి పెట్రోల్ తీసుకువచ్చి పెట్రోల్ పోసి కుటుంబాన్ని మొత్తం హత్య చేయాలని కుట్ర చేశాదని ఇలాంటి నా కొడుకును ఉరి తీయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే బాధితులకి రెండు రోజుల్లో కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని న్యాయం జరగాలని లేకుంటే నిజామాబాద్ జిల్లాలో ఉన్న హిందువులంతా కలిసి కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

## పట్టుదలతో చదివి... బ్యాంకు ఉద్యోగం సాధించి...



**చట్టం రామకృష్ణాపూర్:** శ్రీరాంపూర్ డివిజన్ లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో 2020 నుండి 2023 విద్యా సంవత్సరం వరకు సివిల్ డిప్లమా పూర్తిచేసిన మంచాల అక్షయ భారీ ప్యాకేజీతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కొలువు సాధించి తన సత్తాను చాటింది. 2023 నుండి 2026 విద్యా సంవత్సరంలో కంప్యూటర్ ఇంజనీరింగ్ పూర్తిచేసి కుమారి మంచాల అక్షయ ఇటీవల జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఏకంగా 16.43 (లక్షల) వార్షిక ప్యాకేజీతో ప్రముఖ ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ రంగ సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగం సాధించింది. ఈ సందర్భంగా డిప్లోమో పూర్తిచేసిన అక్షయ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలకు మంగళవారం చేరుకొని తాను మంచి ఫలితాలను సాధించి భారీ ప్యాకేజీతో ఇంటర్నేషనల్ కంపెనీలో ఉద్యోగం పొందడానికి సహకరించిన కళాశాల అధ్యాపకులు, సింగరేణి యాజమాన్యానికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కుమారి అక్షయకు సింగరేణి పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్ కుర్మ రాజేందర్, డీజీఎం డినీల్ కుమార్ లు ప్రత్యేకంగా ఆమెకు అభినందనలు తెలిపారు. ఉద్యోగం నందు బాధ్యతతో కంపెనీకి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని భవిష్యత్లో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 11న కౌన్సెలింగ్ ప్రారంభం




**చట్టం రామకృష్ణాపూర్:** శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలకు సంబంధించి సింగరేణి ఉద్యోగుల పిల్లల ప్రత్యేక కోట సీట్ల భర్తీని ఈ నెల 11న కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కుర్మ రాజేందర్ మంగళవారం పత్రిక ప్రకటనలో ఈ క్రింది విధంగా పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కోర్సులో నాణ్యమైన విద్యను అందించేందుకు సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో మొత్తం 5 కోర్సులతో 300 సీట్లకు గాను, 150 సీట్లు ప్రత్యేకంగా సింగరేణి ఉద్యోగుల పిల్లలకు కేటాయించడం జరిగిందని తెలిపారు. సింగరేణి వారసుల కోటా ద్వారా 150 సీట్ల భర్తీకి గాను కౌన్సెలింగ్ ప్రక్రియను ఈనెల 11న నిర్వహించనున్నామని, ఈ సదా అవకాశాన్ని కార్మికులు, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల పిల్లలు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత నెల 24వ తేదీ నుండి ఈ నెల 8వ తారీకు వరకు పాలిసెట్లో ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఆన్లైన్లో ధరఖాస్తులు స్వీకరించనున్నామని, ఆన్లైన్లో ధరఖాస్తు చేసుకున్న వారితో పాటు ఆన్లైన్లో ధరఖాస్తు చేసుకొని సింగరేణి ఉద్యోగుల పిల్లలు, రిటైర్ కార్మికుల పిల్లలు అడ్మిషన్ కోసం ఈనెల 11న నిర్వహించే కౌన్సెలింగ్ హాజరు కావాలని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేందర్ కోరారు.

**కౌన్సెలింగ్ కొరకు సమర్పించవలసిన డాక్యుమెంట్లు..**

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కోర్సులకు నిర్వహించనున్న కౌన్సెలింగ్ కేంద్రానికి ఈ క్రింద పేర్కొన్న విధంగా డాక్యుమెంట్స్ సమర్పించాలని సూచించారు. ఇందుకోసం ప్రతీ విద్యార్థిని, విద్యార్థులు కులం/EWS సర్టిఫికెట్, స్టడీ/బోనఫైడ్ సర్టిఫికెట్స్, నివాసధృవీకరణ పత్రం, పదవ తరగతి షార్ట్ మెమో/ ఇంటర్నెట్ కాపీ, బదిలీ సర్టిఫికెట్ (TC), పాలిసెట్ హాల్ టికెట్ & ర్యాంకు కార్డు, విద్యార్థితో పాటు వారి తల్లితండ్రుల ఆధార్ కార్డులు, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్, విద్యార్థి తండ్రి విధులు నిర్వహిస్తున్న గని, లేదా కార్యాలయం నుంచి సర్వీస్ సర్టిఫికెట్, ఆన్లైన్ అప్లికేషన్ ఒరిజినల్ కాపీ, కాలేజీ ఫీజు( 20 వేల నగదు ), 8 పాస్ పోర్ట్ సైజు ఫోటోలు, (10) ఎన్విలాప్ కవర్లతో పాటు అన్ని సర్టిఫికెట్లు 4 జతల జిరాక్స్ కాపీలతో కౌన్సెలింగ్ కు హాజరు కావాల్సి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ముందస్తు ఏర్పాట్ల సీట్ల ఎంపిక ప్రక్రియలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని పూర్తిగా స్వేచ్ఛగా నచ్చిన కాలేజీలో, నచ్చిన కోర్సులో సీటు ఎంపిక చేసుకొని ప్రశాంత వాతావరణంలో ఈ ప్రక్రియ జరిగేలా సహకరించాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

## చెందుర్తిలో ఎంఆర్పీఎస్ మండల కమిటీ సమావేశం



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** చెందుర్తి మండల కేంద్రంలో ఎంఆర్పీఎస్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకుడు, వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి అవునూరి ప్రభాకర్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ద్వారా లభిస్తున్న అవకాశాలను మాదిగ విద్యార్థులు, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే ఎంఆర్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ నెల 15న చెందుర్తి మండల ఎంఆర్పీఎస్ నూతన మండల కమిటీ ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఆర్పీఎస్ జిల్లా కోకన్వీనర్ ధోబ్బల ఆనంద్ మాదిగ, ఎంఆర్పీఎస్ చెందుర్తి మండల ప్రధాన కార్యదర్శి కట్కూరి ప్రశాంత్ మాదిగ, ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకుడు సిరిసిల్ల ఆశయ మాదిగ, వీహెచ్పీఎస్ నాయకుడు దుమ్ము రమేష్ మాదిగ, గసికంటి శంకర్ మాదిగ, గసికంటి దేవరాజు మాదిగ, ఆరెల్లి బాబురాజ్ మాదిగ, కట్కూరి యశ్వంత్ మాదిగ, కట్కూరి యోనా మాదిగ, కట్కూరి ప్రవీణ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## రుద్రంగిలో ఎంఆర్పీఎస్ మండల కమిటీ సమావేశం

**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో ఎంఆర్పీఎస్ మండల ఇన్చార్జి దయ్యాల నారాయణ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకుడు, వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి అవునూరి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ద్వారా లభించిన అవకాశాలను మాదిగ విద్యార్థులు, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ఎంఆర్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. రుద్రంగి మండల ఎంఆర్పీఎస్ నూతన కమిటీ ఎన్నికలను ఈ నెల 12వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కమిటీ ఎన్నికల్లో సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని సంస్థ బలోపేతానికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఆర్పీఎస్ జిల్లా కోకన్వీనర్ ధోబ్బల ఆనంద్, దయ్యాల శ్రీనివాస్, దయ్యాల ప్రసాద్, లింగంపల్లి సుదర్శన్, తర్రే తిరుపతి, బగుడు సంజీవ్, పాస్టర్ అహరోను తదితరులు పాల్గొన్నారు.



# గత ప్రభుత్వ వైఫల్యాలతోనే రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి

- రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్ను రూ.7 లక్షల కోట్ల అప్పుగా మార్చారు
- మంత్రి గడ్డం వివేక్ చొరవతోనే క్యాతనపల్లి ఆర్ఓబీ పనులు పూర్తి
- పెండింగ్ బిల్లులన్నీ చెల్లిస్తాం.. కాంట్రాక్టర్లు అధైర్యపడొద్దు
- పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్



**చట్టం రామకృష్ణాపూర్:**

గత బిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు, కమిషన్ల కక్కుర్తి కారణంగానే తెలంగాణ ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారిందని రామకృష్ణాపూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ విమర్శించారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మంచిర్యాలలో జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బిల్డర్స్, కాంట్రాక్టర్ల అసోసియేషన్ సమావేశంలో క్యాతనపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల బిల్లులపై వ్యక్తమైన అభిప్రాయాలను ప్రస్తావించిన శ్రీనివాస్.. 2014లో రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్తో ఉన్న తెలంగాణను బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం లేని ప్రాజెక్టుల పేరిట వేల కోట్లు ఖర్చు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దెబ్బతీశారని అన్నారు. ఈ వాస్తవాలను కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం ద్వారా ప్రజల ముందుంచిందని గుర్తుచేశారు.

**ఏడేళ్లుగా సాగిన ఆర్ఓబీ నిర్లక్ష్యం..**

క్యాతనపల్లి ఆర్ఓబీ పనులకు 2018లో టెండర్లు పిలిచి, 2019లో భూసేకరణ పూర్తి చేసి కాంట్రాక్టర్కు అప్పగించినప్పటికీ పనులను కావాలనే ఆలస్యం చేశారని ఆరోపించారు. 2021 నాటికే పూర్తికావాల్సిన బ్రిడ్జి పనులు మధ్యలో ఎందుకు నిలిచిపోయాయో, అందులో నాటి స్థానిక ఎమ్మెల్యే పాత్ర ఉందేమో సంబంధిత కాంట్రాక్టర్ ఆలోచించుకోవాలని వ్యాఖ్యానించారు. ఆర్ఓబీ పూర్తి కాకపోవడంతో రామకృష్ణాపూర్, క్యాతనపల్లి రైల్వే గేటు వద్ద విద్యార్థులు, కార్మికులు, వ్యాపారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. అత్యవసర సమయంలో వైద్యం అందక గర్భిణులు, గుండెజబ్బు రోగులు అంబులెన్స్లోనే ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటుచేసుకున్నాయని, ఎన్నికల ముందు జరిగిన రైలు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు.

**మంత్రి వివేక్ జోక్యంతో వేగం వంతమైన పనులు..**

చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆర్ఓబీ సమస్యను ప్రాధాన్యంగా తీసుకున్నారని శ్రీనివాస్ తెలిపారు. ఆర్అండ్బీ అధికారులు, కాంట్రాక్టర్లతో వరుస సమీక్షలు నిర్వహించి పనులను వేగవంతం చేశారని పేర్కొన్నారు. రామకృష్ణాపూర్ వైపు భూసేకరణ బాధితులకు రూ.56 లక్షల పరిహారం అందించడంలో మంత్రి కీలక పాత్ర పోషించారని చెప్పారు. కాంట్రాక్టర్ ఆర్థిక ఇబ్బందులను గుర్తించి ఆర్థిక శాఖతో మాట్లాడి ప్రత్యేక టోకెన్ నంబర్ల ద్వారా బిల్లుల చెల్లింపులకు కృషి చేశారని వివరించారు.

**బిల్లులన్నీ చెల్లిస్తాం..**

విద్యార్థుల స్కాలర్షిప్లు, ఆరోగ్యశ్రీ బకాయిలు, కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులను దశలవారీగా విడుదల చేస్తున్నామని తెలిపారు. మిగిలిన బిల్లులన్నింటినీ కూడా త్వరలోనే చెల్లిస్తామని, కాంట్రాక్టర్లు అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రజల ప్రయాణ సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని మంత్రి గడ్డం వివేక్ ప్రత్యేక శ్రద్ధతో ఆర్ఓబీ పనులను పూర్తి చేయించారని, కాంట్రాక్టర్ల సమస్యలను కూడా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకల సురేందర్, జోగుల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకురాలు జాలిగాం రాజేశ్వరి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమం ఆగదు..**

ప్రస్తుత ఆర్థిక ఇబ్బందులకు గత ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. అప్పులపై వడ్డీలు చెల్లించడానికే ప్రభుత్వ ఖజానాపై భారీ భారం పడుతోందన్నారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందని తెలిపారు. గత పాలనలో ఉద్యోగులకు డీఏలు, పీఆర్సీలు ఆలస్యంగా అమలయ్యాయని, జీతాల చెల్లింపుల్లోనూ జాప్యం ఉండేదని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రతి నెల ఒకటో తేదీన ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమ చేస్తున్నామని పేర్కొన్నారు.

## ప్రతి కేసు గడువులోపు పూర్తి చేయాలి

**నేర నియంత్రణలో సాంకేతికత కీలకం : అంబర్ కిషోర్ ఝా**



**చట్టం రామగుండం :** రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మే నెల నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తు పురోగతి, వారెంట్ల అమలు, పోలీసు సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు. కమిషనరేట్ పరిధిలో నమోదైన ప్రతి కేసును నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి, నాణ్యమైన దర్యాప్తుతో నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్లో ఉన్న పాత కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, అవసరమైతే న్యాయ సలహాలు తీసుకుని దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. ఆస్తి, ఆర్థిక నేరాల కేసుల్లో ఆస్తుల గుర్తింపు, స్వాధీనం, అటాచ్మెంట్ ప్రక్రియలను వేగవంతం చేయాలని తెలిపారు. మహిళలకు సంబంధించిన తీవ్రమైన కేసుల్లో నిందితుల అరెస్టులను ఆలస్యం చేయరాదని, గ్రేవ్ కేసులు, ఎన్డీపీఎస్ కేసులను డీసీపీలు, ఏసీపీలు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పెండింగ్ నాన్‌బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రతిరోజూ పర్యవేక్షణ చేపట్టాలని, చిన్నచిన్న నేరాలపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులు, సీసీపీ పిటిషన్ల విచారణలో క్షేత్రస్థాయి వాస్తవాలను నిర్ధారించి పారదర్శకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్లకు ఎవరినీ అనవసరంగా పిలవరాదని, అరెస్టుల విషయంలో ఎస్ఓపీని కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రతి ఎస్హెచ్ఓ, సీఐ స్థానిక ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేసి ముందస్తు సమాచార సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు అప్రమత్తతతో వ్యవహరించాలని, ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు తరచూ డ్రిల్ ప్రాక్టీస్‌లు నిర్వహించాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ సిబ్బందితో మాట్లాడుతూ నేరాల దర్యాప్తు, నేరస్తుల గుర్తింపు, కేసుల నిర్వహణలో పారదర్శకత, వేగాన్ని పెంచేందుకు సీసీటీఎన్ఎస్ 2.0 మరియు ఈసాక్ష్య (eSakshya) వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. డిజిటల్ ఆధారాల సేకరణ, భద్రపరచడం, కోర్టుల్లో సమర్పణ ప్రక్రియను మరింత పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. సీసీటీఎన్ఎస్, ఎస్సీఆర్బీ నివేదికలు, ఎన్టీఆర్ ఫోటో డేటాబేస్‌తో పాటు ఇతర డిజిటల్ రికార్డులను నిరంతరం నవీకరించాలని ఆదేశించారు. ఎఫ్ఐఆర్‌లు, నేర వివరాలు, అరెస్టు వివరాలు, చార్జ్‌షీట్లు తదితర అంశాలను నిర్ణీత సమయంలో సిస్టమ్‌లో నమోదు చేయాలని సూచించారు. తప్పుడు లేదా అనవసర సమాచారాన్ని అప్లోడ్ చేయరాదని హెచ్చరించారు. సీసీటీఎన్ఎస్‌లో పెండింగ్ లేకుండా డేటా అప్లోడ్ చేసే సిబ్బందికి రివార్డులు అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి, అదనపు డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌పై ఆకస్మిక తనిఖీ




**చట్టం - సిద్దిపేట ప్రతినిధి :**

సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ట్రాఫిక్ ఏసీపీ ఎం. సుమన్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని వసతులు, సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణతో పాటు ట్రాఫిక్ నియంత్రణ చర్యలను సమగ్రంగా పరిశీలించారు. తనిఖీల సందర్భంగా స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది హాజరు, పట్టణంలో అమలవుతున్న ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యక్రమాలు, ట్రాఫిక్ నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఈచలాన్ల పరిష్కారం, ప్రమాదాల రిజిస్టర్లు, పరిపాలనా రికార్డులను నిశితంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఏసీపీ, స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరికరాల పనితీరును కూడా పరిశీలించారు. పట్టణంలో ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత బలోపేతం చేయాలని, రోడ్డు భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. పెండింగ్‌లో ఉన్న వివిధ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.

## జిల్లా విద్యాశాఖాధికారిని మర్యాదపూర్వకంగా కలిసిన ట్రస్మా నాయకులు



**చట్టం సిద్ధిపేట ప్రతినిధి :** ఇటీవల నూతన జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన శాస్త్రీ నీ మంగళవారం రోజున తన కార్యాలయంలో జిల్లా ట్రస్మా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం 20262027 లో పదవతరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేయాలని సూచించారు. విద్యతో పాటు విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢపడేలా చూడాలన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని రంగాలలో రాణించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు అని చెప్పారు. విద్యను వ్యాపార ధోరణిలో కాకుండా సేవా భావంతో పాఠశాలలను నడిపించాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారిని కలిసిన వారిలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు నాగిడి నరసింహా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తు.మహిపాల్ రెడ్డి, జిల్లా కోశాధికారి కాయిత శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర ఈసి మెంబర్ అశోద అంజయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాష్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మిద్దెల యాదగిరి, జిల్లా గౌరవ అధ్యక్షులు కాయిత నారాయణ రెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో వెంటనే విలీనం చేయాలి

**ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న డిమాండ్.**



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** ఆర్టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలినం చేయాడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విలీన ప్రక్రియను ప్రారంభించాలని ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డిని కోరారు. మంగళవారం నాడు హుస్నాబాద్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టిసి కార్మికుల్లో నెలకొన్న విలీనమా లేక యూనియన్ ఎన్నికల అనే గందరగోళానికి తక్షణమే తెరదించాలని ఈదురు వెంకన్న సిఎం రెవంత్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్, సిపిఐ కొహెడ మండల కార్యదర్శి వెల్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల, విద్యార్థినుల రక్షణే 'షీ టీమ్' ధ్యేయం: ఇన్స్పెక్టర్ ఎ.బి. దుర్గ



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** మహిళల, విద్యార్థినుల మరియు బాలికల రక్షణే ధ్యేయంగా తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'షీ టీమ్స్' నిరంతరం శ్రమిస్తున్నాయని సిద్దిపేట ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎ.బి. దుర్గ పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని దేశాయ్ బీడీ కంపెనీలో సిద్దిపేట జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో మహిళా కార్మికులకు, సిబ్బందికి ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్స్పెక్టర్ దుర్గ మేడమ్ మహిళలకు చట్టాలపై, వారి హక్కులపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సుదీర్ఘంగా వివరించారు. ఈవ్ టీజింగ్ (పోకిరీల వేధింపులు), పని చేసే చోట ఎదురయ్యే వేధింపులు మరియు సోషల్ మీడియా వేధింపులపై మహిళలు ఎలా అప్రమత్తంగా ఉండాలో తెలిపారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని, వీటిని అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిన్న పిల్లలకు 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్' లపై తల్లిదండ్రులు అవగాహన కల్పించాలన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ క్రైమ్స్, సైబర్ బుల్లీయింగ్ (ఆన్‌లైన్ వేధింపులు) పట్ల మహిళలు, యువతులు మోసపోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. మహిళలు ఎక్కడ, ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా అధైర్యపడకుండా తక్షణమే అత్యవసర సహాయం కోసం 100 నంబర్‌కు గానీ, లేదా సిద్దిపేట షీ టీమ్ నంబర్ 8712667434 కు గానీ ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు.

# రైతు వ్యతిరేక విధానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది : వేముల ప్రశాంత్ రెడ్డి

**చట్టం, నిజామాబాద్ ప్రతినిధి :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ అవగాహన సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఆయన ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై తీవ్ర విమర్శలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు ఒక ఫోన్ కాల్‌తో యూరియా బస్తాలను పొలాల వద్దకే తెప్పించుకునే సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం అమలవుతున్న యాప్ విధానం రైతులకు ఇబ్బందికరంగా మారిందని అన్నారు. ఒక రైతుకు అవసరమైన యూరియా మొత్తం ఒకేచోట అందకపోవడంతో పలుచోట్ల తిరగాల్సిన పరిస్థితి నెలకొందని విమర్శించారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా యాప్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి గతంలో 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందేదని, ప్రస్తుతం విద్యుత్ సరఫరా పరిమితమైందని ఆరోపించారు. మూడు




గంటల విద్యుత్‌తో వ్యవసాయం సాధ్యమా అని ప్రశ్నిస్తూ, ఆ మేరకు ప్రభుత్వం నిరూపించాలని సవాల్ విసిరారు. రైతులకు నిరంతరాయంగా 24 గంటల ఉచిత విద్యుత్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతుల ప్రయోజనాల కోసం రెండు తీర్మానాలను ఆమోదించినట్లు తెలిపారు. యూరియా యాప్ విధానాన్ని రద్దు చేయడం, రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించడం వాటిలో ప్రధానమైనవని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. రైతు డిస్కం ఏర్పాటు వెనుక ఉచిత విద్యుత్ వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. విద్యుత్ రంగ సంస్కరణల పేరుతో రైతులపై అదనపు భారం మోపే ప్రమాదం ఉందన్నారు. రహదారుల నిర్మాణంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) ద్వారా భారీ అవినీతి జరుగుతోందని ఆరోపించారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుతం రోడ్ల నిర్మాణ వ్యయం అసాధారణంగా పెరిగిందని, ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని అన్నారు. హైడ్రా సంస్థ పేదల ఇళ్లను కూల్చివేస్తూ, అధికార పార్టీ నేతల అక్రమ నిర్మాణాలను వదిలేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడడంలో ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్ర అస్తిత్వం మళ్లీ ప్రమాదంలో పడిందని వ్యాఖ్యానించారు. కొందరు అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ శ్రేణులను వేధిస్తున్నారని ఆరోపిస్తూ, భవిష్యత్తులో దీనికి తగిన సమాధానం ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆన్లైన్లో ఇసుక సరఫరా కొరకు కొత్తగా మన ఇసుక మన వాహనం పథకం



**చట్టం బిచ్కుంద :** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం లోని హస్గుల్ గ్రామ పరిధి లో గల ఇసుక క్వారీ ను ఆన్లైన్లో ఇసుక సరఫరా కొరకు కొత్తగా మన ఇసుక మన వాహనం పథకం లో చేర్చడం జరిగింది.అందువలన మంగళవారం రోజు హస్గుల్ గ్రామంలోని రైతు వేదికలో మన ఇసుక మన వాహనం కార్యక్రమం పై ట్రాక్టర్ యజమానులకు డ్రైవర్లకు అవగాహన కల్పించిన తాసిల్దార్ వేణుగోపాల్ . ఆన్లైన్ ఇసుక రవాణా విధానంలో తీసుకోవాల్సిన చర్యలు జాగ్రత్తల గురించి ట్రాక్టర్ డ్రైవర్లకు ఓనర్లకు వివరించడం జరిగింది. ఆన్లైన్ ఇసుక విధానం హస్గుల్ లో మొదలు పెడుతున్నందున గ్రామంలో ఎటువంటి డంపులు ఏర్పాటు చేయవద్దని మరియు ఇసుక నింపిన ట్రాక్టర్లు ట్రాలీలు ఉండడానికి వీలులేదని కేవలం నదిలోని ఇసుక పాయింటు నుండి ఇసుక ఆన్లైన్ ద్వారా ఓటిపి ద్వారా ఇవ్వడం జరుగుతుందని వారికి తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వేణుగోపాల్ ఎస్సై రాజు గిద్ద వార్ అంజు గ్రామ సర్పంచ్ ట్రాక్టర్ డ్రైవర్లు ఓనర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

## తెట్టే కుంటలో అక్రమ మట్టి తరలింపు

**జేసీబీతో సహా ఐదు ట్రాక్టర్ల స్వాధీనం.. - డయల్-100 ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు**



**చట్ట, తూప్రాన్:** తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని హుసేన్‌పూర్ గ్రామ శివారులో ఉన్న తెట్టకుంట నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తూ అక్రమంగా మట్టి తరలిస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. కుంటలో భారీగా మట్టి తవ్వడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, సహజ జలవనరుకు నష్టం వాటిల్లినట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ మట్టి తవ్వకాలపై ఇరిగేషన్, మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తూప్రాన్ మాజీ మున్సిపల్ చైర్మన్ రవీందర్ గౌడ్ తహసీల్దార్ తో మాట్లాడి మౌఖిక ఆదేశాల మేరకు 6వ వార్డులో 4.50 లక్షల వ్యయం తో వర్క్ ప్రొసిడింగ్ తో రహదారి పనుల కోసం కొక్కొండ కాశిరెడ్డి ఆధ్వర్యంలో ఎలాంటి అనుమతులు లేకుండా తెట్టకుంట నుంచి మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మన్నె భాను, వర్గంటి గౌతమ్ గౌడ్ తదితరులు వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. అనంతరం గజ్వేల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తూముకుంట నర్సారెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఫిర్యాదు అందుకున్న ఏఎస్ఐ వాని తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని తనిఖీలు నిర్వహించారు. అక్కడ అక్రమ మట్టి తవ్వకాలకు వినియోగిస్తున్న ఒక జేసీబీ యంత్రంతో పాటు ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని తూప్రాన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు. సంబంధిత శాఖల నివేదికల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఘటనపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అక్రమ మట్టి తవ్వకాల వెనుక ఉన్న బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కుంటను యథాస్థితికి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ఆలయాల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ ప్రారంభం



**చట్టం, భైంసా :** నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గంలో ఆలయాల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ ప్రారంభమైనట్లు స్థానిక ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తానూరు మండలంలోని బేల్ తరోడా గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి 30 లక్షల రూపాయలు నిధులు మంజూరు కాగా, అదేవిధంగా బైంసా మండలంలోని చుచుంద్ గ్రామ శివాలయంలో కళ్యాణ మండప నిర్మాణానికి 20 లక్షల రూపాయల నిధులు మంజూరు కాగా టెండర్ ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. దశలవారీగా నియోజకవర్గంలో ఆయా ఆలయాల కు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలియజేశారు.

## బాసర వక్ఫ్ బోర్డు భూముల వేలం పాట

**చట్టం, బాసర :** నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలోని స్థానిక తహశీల్ కార్యాలయంలో బాసర మండల కేంద్రానికి చెందిన వక్ఫ్ బోర్డు భూముల వేలంపాట నిర్వహించగా 137.20 గుంటల భూమికి గాను 11,97,000 రూపాయల భారీ ఆదాయం వచ్చింది. ఈ వేలం పాటలు గ్రామస్తులతో పాటు పరిసర గ్రామస్తులు అమితుమీ అంటూ వేలంలో పాల్గొనగా ఆరుగురు వ్యక్తులు ఈ 11 లక్షల 97 వేల నగదు ను ఒక సంవత్సరానికి కౌలుకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తాసిల్దార్ పవన్ చంద్ర తో పాటు ఆర్ఐ అభిమన్యు, స్థానిక బాసర మజీద్ కమిటీ సభ్యులు కౌలు రైతులు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నిర్మల్ జిల్లా బాసరలో విషాదం





- పుణ్య స్నానానికి వెళ్లి అనంత లోకానికి
- గోదావరి నదిలో ముగ్గురు అన్నదమ్ముల గల్లంతు
- సంఘటన స్థలానికి చేరుకున్న భైంసా ఏఎస్పి సాయికిరణ్
- మూడు శవాలు చూసి కన్నీటి సంద్రమైన గోదావరి ప్రాంతం

**చట్టం, బాసర :**

భారతదేశంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ క్షేత్రానికి ఓ కుటుంబం దర్శనానికి బయలుదేరక మంగళవారం నిర్మల్ జిల్లా బాసర గోదావరిలో ముగ్గురు అన్నదమ్ములు నీట మునిగి గల్లంత కాదా విషాద ఛాయలు నెలకొన్నాయి, పుణ్య స్నానాలకు పవిత్ర గోదావరి నది త్రిబుల్ ఐటీ పంప్ హౌస్ సమీపాన స్నానమాచరించడానికి కుటుంబ సభ్యులతో వెళ్ళగా నదిలో నీరు తగ్గిపోవడంతో నీటిని పసికట్టలేక హైదరాబాద్ మహానగరంలోని కాచిగూడ చెప్పల్ బజారుకు చెందిన నాగభూషణం కు చెందిన ముగ్గురు కుమారులు, చంద్రశేఖర్ (38) రామచందర్ (36) మల్లేష్ (31) గోదావరి నదిలో స్నానానికి వెళ్లగా నదిలో లోతైన ప్రాంతంలో వెళ్లినప్పుడు ఒకరు పూర్తిగా వారిని కాపాడబోయి ఒకరినొకరు ఇద్దరు అన్నదమ్ములు గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో అక్కడున్న కుటుంబ సభ్యులు కేకలు వేస్తూ రోధనాలు వినిపించగా స్థానికులు వెళ్లి స్థానిక పోలీసులకు సమాచారం అందించగా, బాసర సీఐ దీపక్ పోలీసు బృందంతో వెళ్లి సంఘటన స్థలంలో వివరాలు సేకరించి, గల్లంతయిన శవాలు మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలతో పాటు గజతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు కొనసాగించగా సాయంత్రం శవాలు దొరకడంతో నది ఒడ్డున బయటకు తీసి, అనంతరం పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో గత సంవత్సరం కూడా అదే ప్రాంతంలో ఒకేసారి ఐదుగురు నీట మునిగి చనిపోవడంతో స్థానికులతో పాటు సేవలను చూసిన భక్తులు పలువురు కంటతడి పెడుతూ ప్రతి ఒకరు కన్నీరు మున్నీరు అయినారు. అదేవిధంగా కుటుంబీకులు బంధువులు రోధనాలు మిన్నంటాయి, ఈ నేపథ్యంలో రామచంద్రాన్ని వ్యక్తికి ఒక కుమారుడు కుమార్తె ఉండగా మొత్తం ఎనిమిది మంది కుటుంబ సభ్యులు అమ్మవారి దర్శనం కోసం రాగ తిరిగి అనంత లోకానికి వెళ్లడంతో అమ్మ మాపై ఎందుకు ఇంత కోపం వచ్చింది ముగ్గురు కుమారులను కోల్పోవడం ఎంత దౌర్భాగ్యం అంటూ తండ్రి రోధనాలు అందరిని కలకాలం రేపాయి, ఈ సందర్భంగా బాసర గోదావరి నదిలో నీట మునిగి ముగ్గురు అన్నదమ్ములు గల్లంతు అయిన విషయం తెలుసుకున్న భైంసా ఏఎస్పి సాయి కిరణ్ సంఘటన స్థలానికి చేరుకొని దొరికిన శవాలను పంచనామ నిమిత్తం భైంసా ఆసుపత్రికి తరలించాలని స్థానిక పోలీసులకు ఆదేశించారు. అదేవిధంగా చనిపోయిన మృతుల వారి తండ్రి నాగభూషణం పలు వివరాలను అడిగి తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సేవలు గల్లంతు కావడంతో స్థానిక తహసిల్దార్ పవన్ చంద్ర తో పాటు రెవెన్యూ పోలీసు ఆలయ సిబ్బంది అక్కడుండి శవాలు దొరికే వరకు గాలింపు చర్యలు కొనసాగించి బంధువులకు ఓదార్చారు. ఒకే రోజు ఒకే నిమిషంలో ముగ్గురు అన్నదమ్ములు నీట మునిగి గల్లంతు కావడంతో తిరిగి శవమై నది ఒడ్డున తేలడంతో బంధువులతో పాటు పలువురు ప్రాంతీయవాసులు కన్నీరు మున్నీరు అయినారు ఇలాంటి సంఘటనలు పునరుద్ధం కాకుండా గోదావరి నది తీరాన గట్టి బందు బస్తు సీసీ కెమెరాలతో గస్తీ పోలీసుల నిఘా నీడ పెట్టాలని పలువురు తమ తమ ఆవేదన వెలిబుచ్చారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందాలి




**విద్యార్థులందరికీ నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతులు కల్పించాలి**

**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులందరికీ కార్పొరేట్ స్థాయి విద్యను అందించడంతోపాటు మెరుగైన వసతులు, నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పాఠశాలలు త్వరలో పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం విద్యాశాఖ అధికారులతో కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించే విధంగా విద్యాబోధన సాగాలని సూచించారు. ఇప్పటికే మండలాలకు పాఠ్యపుస్తకాల పంపిణీ దాదాపు పూర్తయిందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాలను మరింత మెరుగుపర్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. అన్ని విద్యాసంస్థల్లో విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి పాఠశాలలు, వసతి గృహాలు, వంటశాలలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని పేర్కొన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతున్నందున, వసతి గృహాల్లో నిల్వ ఉన్న ఆహార పదార్థాల గడువు తేదీలను పరిశీలించి, నాసిరకం లేదా గడువు ముగిసిన సరుకులు వినియోగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాణ్యమైన భోజనాన్ని అందించడంలో మెస్ కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ భోజన ప్రమాణాలు, ఆహార పదార్థాల నాణ్యతను మెస్ కమిటీ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. స్టోర్ రూమ్‌లలో కూరగాయలు, ఇతర వస్తువులను సక్రమంగా భద్రపరచాలని తెలిపారు. వంట సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడాలని, తప్పనిసరిగా మాస్కులు, ఏప్రాన్‌లు, తల టోపీలు ధరించాలని ఆదేశించారు. వంట పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రపరచడంతో పాటు వంటశాలల్లో మిగిలిన ఆహారం, చెత్తా చెదారాన్ని వెంటనే తొలగించి పరిశుభ్ర వాతావరణం కల్పించాలని సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు వసతి గృహాల్లో ఏఎన్ఎంలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు దయానంద్, అంబాజీ, శ్రీనివాస్, ఎంఈఓలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పింఛన్ ధ్రువీకరణలను తొందరగా పూర్తి చేయాలి

**వార్డు ఆఫీసర్లు తప్పనిసరిగా రిజిస్టర్ ఉపయోగించాలి.. అధికారులు సమయపాలన పాటించాలి**



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట పట్టణంలో ఇటీవల పింఛనర్ లకు చేపట్టినటువంటి కసుపాప (ఐరిస్), వేలిముద్రల విధానానికి గడువుకాలంలోగా పూర్తి చేయాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ అన్నారు. మంగళవారం రోజున సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో పట్టణ వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. వార్డు ఆఫీసర్లు ప్రతిరోజు క్రమం తప్పకుండ వార్డులో పర్యటించాలని, తమ తమ వార్డులలో చేస్తున్నటువంటి ప్రతి పనికి తప్పనిసరిగా రిజిస్టర్ ఉపయోగించాలని చెప్పారు. సిద్దిపేటలో పింఛన్ పొందుతున్నటువంటి వారు తప్పనిసరిగా ఇట్టి విధానాన్ని వినియోగించుకోవాలని అన్నారు. దూరపు ప్రాంతాలలో ఉండేవారిని గుర్తించి వెంటనే సమాచారం అందించాలని,పనిని వేగవతంగా పూర్తి చేయాలనీ సూచించారు. అధికారులందరూ తప్పకుండ సమయపాలన పాటించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ కి రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది పూలమొక్కను అందించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్, ఆర్ఐ లు ఎల్లారెడ్డి, భరధ్వాజ్ ,వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

## వర్షాలు సంవృద్దిగా కురువాలని శ్రీరామునికి అభిషేకాలు

- ఘనంగా నిర్వహించిన రామకోటి రామరాజు దంపతులు
- ఈ సంవత్సరం పాడి పంటలు సంమృద్ధిగా పండాలి



**చట్టం సిద్దిపేట (దుబ్బాక) :** ఈ సంవత్సరం వర్షాలు సంమృద్ధిగా కురురిసి పాడిపంటలు బాగా పండాలని ప్రతి రైతు ఆనందంగా ఉండాలని కోరుతూ మంగళవారం నాడు సిద్దిపేట జిల్లా గజ్వేల్ లోని అద్దాల మందిరం వద్ద శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు దంపతులు సీతారాములకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాలు సంమృద్ధిగా కురువాలని, పాడి పంటలు పండాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. వర్షాలు బాగా కురుస్తే పంటలు ఎక్కువగా పండుతాయని, వర్షాలతో వ్యవసాయం ముందుకు సాగుతుందన్నారు. దేశానికి రైతే వెన్నుముఖ అని, అలాంటి రైతులు సుఖంగా ఉండాలని తెలిపారు. భజనలతో, కీర్తనలతో భగవంతుణ్ణి సేవించుకున్నట్లు తెలిపారు.

## ఎస్టీయు 80వ ఆవిర్భావ దినోత్సవం



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్ టి యు) ఆవిర్భావ దినోత్సవం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఘణంగా జరిగింది. జిల్లా అధ్యక్షులు మ్యాడ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి పట్నం భూపాల్ ఎస్టియు జెండా పతాకావిష్కరణ చేసి మాట్లాడుతూ 80 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల పక్షాన నిలబడి పోరాటం చేసిన ఏకైక సంఘం ఎస్టీయు అని అన్నారు. మొట్టమొదటి ఉపాధ్యాయ సంఘంగా ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషి చేసిందని, ఉపాధ్యాయుల పక్షపాతిగా పేరు తెచ్చుకున్న సంఘమన్నారు. మట్టపల్లి రంగారావు, ఐత అంజయ్య, ఖాత యాదగిరి, రామంచ రవీందర్, ఉండ్రాళ్ళ రాజేశం, లింగ శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, గణేష్, శ్రీనివాస్, మధుసూదన్, రాజ్ కుమార్, కృష్ణమూర్తి, తిరుమలేష్, సుధాకర్, రాములు, శ్రీకాంత్, నరేష్, రాజేశం, రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కల్లు దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలి: ఆర్ఎస్పీ




**చట్టం, నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కల్లు దుకాణాలు, కల్లు డిపోలపై కఠిన చర్యలు తీసుకోవాలని రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్ఎస్పీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం జిల్లా ఎక్సైజ్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్పీ జిల్లా కన్వీనర్ కటారి రాములు మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ కల్లు దుకాణాలు, డిపోలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కొన్ని కల్లు డిపోలలో అధిక మత్తు పదార్థాలు కలిపి విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు ప్రజల నుంచి వస్తున్నాయని తెలిపారు. అలాంటి డిపోలపై ఎక్సైజ్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యా సంస్థలు, దేవాలయాలు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాలకు సమీపంలో ఉన్న కల్లు దుకాణాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. మద్యం, మత్తు పదార్థాల వినియోగం యువతపై తీవ్ర ప్రభావం చూపుతోందని, సమాజంలో అనేక సామాజిక సమస్యలకు కారణమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నిజామాబాద్ నగరాన్ని మత్తు పదార్థాల రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ఎక్సైజ్ శాఖ, పోలీసు శాఖ సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పిట్ల నరేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రి నగర్ కాలనీ వాసుల ఆందోళన

- వర్షా కాలం వస్తుందని మా కాలనీ నీటితో నిండి పోతుందని ఆవేదన



**చట్టం, తూప్రాన్:** తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని గాయత్రి నగర్ కాలనీ వాసులు మంగళవారం ఆందోళనకు దిగారు. వర్షా కాలం సమీపిస్తున్న నేపథ్యంలో గతంలో ఎదుర్కొన్న వరద సమస్యలు మళ్లీ పునరావృతమవుతాయనే భయంతో కాలనీ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత సంవత్సరాల్లో కురిసిన భారీ వర్షాల సమయంలో కాలనీలోకి వర్షపు నీరు చేరి ఇళ్లలోకి ప్రవేశించడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని స్థానికులు తెలిపారు. ఇప్పటి వరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఏర్పడుతుందేమోనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పెద్ద ఎత్తున గుమిగూడి, మహిళలు, చిన్నారులు, కుటుంబ సభ్యులతో కలిసి "మా కాలనీని కాపాడండి", "వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి" అంటూ నినాదాలు చేశారు. కాలనీలో నీటి పారుదల వ్యవస్థను మెరుగు పరచాలని, డ్రైనేజీ కాలువలను విస్తరించాలని, వర్షపు నీరు నిల్వ కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని వారు మున్సిపల్ అధికారులను కోరారు. వర్షా కాలం ప్రారంభమయ్యేలోపు సమస్యను పరిష్కరించి తమకు రక్షణ కల్పించాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. సమస్యను వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులకు వినతి చేశారు.

## గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి



**చట్టం గాంధారి:** గాంధారి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న రఘు గుండెపోటుతో ఆకస్మాత్తుగా మృతి చెందారు. కానిస్టేబుల్ రఘు బాన్సువాడ వాసి. బాన్సువాడ లోని ఆయన స్వగృహంలో విషాద ఛాయలు. కానిస్టేబుల్ రఘు మృతి పట్ల పోలీస్ అధికారులు తోటి సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబానికి పోలీసులు సంతాపం ప్రకటించారు.

CHATTAM NEWS
చట్టం సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

# ఐక్య పోరాటాలను దెబ్బతీస్తున్న ఏఐటీయుసి

- రెండు కళ్ళ విధానాన్ని మానుకోవాలి
- తుమ్మల రాజారెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**చట్టం రామగుండం :**

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని ఐక్య పోరాటాలకు పిలుపునిస్తామని చెప్పిన ఏఐటీయూసీ, ఇప్పుడు ఒంటరిగా సమ్మె నోటీసు ఇవ్వడం సరైన విధానం కాదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి విమర్శించారు. గోదావరిఖనిలోని శ్రామిక భవన్‌లో నిర్వహించిన సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) బ్రాంచ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక సమస్యలపై అన్ని సంఘాలను కలుపుకొని జేఏసీ ఏర్పాటు చేసి పోరాటం చేయాలని సీఐటీయూ మొదటి నుంచే కోరుతుందని, అయితే ఏఐటీయూసీ ఒంటరిగా ధర్నాలు, సమ్మె నోటీసులు ఇవ్వడం ద్వారా కార్మిక ఐక్యతకు భంగం కలిగిస్తోందని అన్నారు. జేఏసీ ఏర్పాటుకు ఇతర సంఘాలు సహకరించలేదని చెబితే, ఏ సంఘాలు స్పందించలేదో కార్మికులకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. గెలిచి రెండేళ్లు పూర్తవుతున్నప్పటికీ ఏఐటీయూసీ కార్మికులకు ఉపయోగపడే విధంగా సాధించిన హక్కులు ఏవీ లేవని ఆరోపించారు. మెడికల్ బోర్డు సమావేశాలు,




సొంతింటి కల, అలవెన్సులపై ఐటీ మినహాయింపు, వేజ్ బోర్డు ఒప్పందం అమలు, మైనింగ్ స్టాఫ్ ప్రమోషన్లు, బదిలీలు వంటి కీలక అంశాల్లో యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికులను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. కార్మికుల్లో వ్యతిరేకత పెరిగిన సమయంలో మాత్రమే పోరాటాల పేరుతో ప్రకటనలు చేయడం ఏఐటీయూసీ నాయకత్వానికి అలవాటైందని అన్నారు. అన్ని కార్మిక సంఘాలను సంప్రదించి జేఏసీ ఏర్పాటు చేసిన తర్వాతే సమ్మె నోటీసు ఇవ్వాలని, లేకపోతే సీఐటీయూ ఇతర సంఘాలతో కలిసి నిరవధిక సమ్మెకు సిద్ధంగా ఉందని హెచ్చరించారు. గతంలో జరిగిన విజయవంతమైన సమ్మెలన్నీ అన్ని కార్మిక సంఘాల ఐక్యతతోనే జరిగాయని, ఒంటరి పోరాటాలతో ఫలితాలు సాధ్యం కాదని పేర్కొన్నారు. ఎండా కాలంలో చేయాల్సిన సమ్మెను వర్షాకాలంలో ప్రకటించడం వల్ల ఉత్పత్తిపై ప్రభావం తక్కువగా ఉండి యాజమాన్యానికే లాభం చేకూరుతుందని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారంపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే అన్ని సంఘాలను కలుపుకొని ఐక్య పోరాటాలకు పిలుపునివ్వాలని కోరారు. ఈ సమావేశంలో వంగల శివరామిరెడ్డి, మెండె శ్రీనివాస్, ఆరెపల్లి రాజమౌళి, అనబోయిన శంకర్, జనార్దన్ రెడ్డి, కొమ్మ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలే అందించాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. సోమవారం సాయంత్రం సోన్ మండల కేంద్రంలోని బాలకిషన్ ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, ఎరువులు, విత్తనాల స్టాక్‌తో పాటు క్రయ విక్రయాల రిజిస్టర్లను పరిశీలించారు. రిజిస్టర్లలో నమోదు చేసిన వివరాలను ఆన్‌లైన్ రికార్డులతో సరిపోల్చి పరిశీలించిన కలెక్టర్, అన్ని లావాదేవీలను పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. రికార్డుల్లో ఎలాంటి తేడాలు ఉండకూడదని స్పష్టం చేశారు. అలాగే పలు కంపెనీల విత్తనాల లేబుళ్లను పరిశీలించి నాణ్యత ప్రమాణాలపై ఆరా తీశారు. సందర్భంగా మాట్లాడుతూ, రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీ విత్తనాలు విక్రయించరాదని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే అందించాలని, ఎరువులు, విత్తనాలపై ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా వసూలు చేయరాదని అన్నారు. రైతులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని ఆదేశించారు. ఎరువులు, విత్తనాల కృత్రిమ కొరత సృష్టించడం, నకిలీ ఉత్పత్తులు విక్రయించడం లేదా అధిక ధరలకు అమ్మడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, రైతులకు నాణ్యమైన విత్తనాల సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తనిఖీలలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, తహసీల్దార్ సంతోష్, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ భయం పట్టుకుంది

**రాష్ట్ర బిజెపి నాయకులు రావుల రాంనాథ్**




**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ భయం పట్టుకుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ ఆరోపించారు. మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి బీజేపీ పార్టీని, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ తో పాటు దేశ ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమై కేంద్ర ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదని అన్నారు. రైతుల పండించిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన అనంతరం కేంద్ర ప్రభుత్వం సేకరిస్తుందని, తెలంగాణలో వరి ధాన్యం కొనుగోలు చేయబోమని కేంద్రం ఎప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జాప్యానికి కేంద్రాన్ని బాధ్యులను చేయడం తగదని పేర్కొన్నారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నాయకత్వంలో చేపట్టిన "రైతు గోస - బీజేపీ భరోసా యాత్ర" ప్రభావంతోనే అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు వేగవంతం చేశారని అన్నారు. ప్రజా సమస్యలపై మహేశ్వర్ రెడ్డి నిరంతరం పోరాటం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో బీజేపీ కీలక పాత్ర పోషించిందని, రాష్ట్రం ఎవరి జాగీరు కాదని వ్యాఖ్యానించారు. ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవడంతో బీజేపీపై విమర్శలు చేస్తోందని ఆరోపించారు. గత ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును ఫామ్‌హౌస్‌కే పరిమితం చేసినట్లే, రాబోయే ఎన్నికల్లో సీఎం అనుముల రేవంత్ రెడ్డిని కొడంగల్‌కే పరిమితం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, నాయకులు ముత్యం రెడ్డి, రాచకొండ సాగర్, పొన్నం నారాయణ గౌడ్, జుట్టు దినేష్, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం: విజయరమణ రావు



**చట్టం పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 66 మంది కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.66,07,656 విలువైన చెక్కులను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయరమణ రావు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల విషయంలో అన్యాయం జరిగిందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి పేదల సొంతింటి కలను సాకారం చేస్తోందన్నారు. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను కేటాయించగా, జూన్ నెలాఖరులో రెండో విడతలో మరో 2,000 ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల జనాభా ప్రాతిపదికన అర్హులను గుర్తించి ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. వ్యవసాయంపై మాట్లాడిన ఆయన, మృగశిర కార్తె ప్రారంభమైనందున రైతులు ఆలస్యం చేయకుండా నార్లు పోసుకోవాలని సూచించారు. 105 రోజుల్లో పండే వరి రకాలను ఎంచుకోవడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా పత్తి, మొక్కజొన్న, కందుల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. ఈ పంటలకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతు ధర కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా, రైతుల ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోళ్లు నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాముడు, ఎంపీడీవో దివ్య దర్శన్, గోపగోని సారయ్య గౌడ్, రామిడి తిరుపతిరెడ్డి, చదువు రామచంద్రన్ రెడ్డి, సదయ్య, లంక సదయ్యతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బంపర్ తగిలి చిన్నారి మృతి



**చట్టం పోతంగల్ /కోటగిరి :** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని కోటగిరి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. పాల గంగారం తన ట్రాక్టర్‌కు కల్టివేటర్‌ను తగిలించేందుకు వాహనాన్ని వెనక్కి తీస్తుండగా, సమీపంలో ఆడుకుంటున్న అతని రెండేళ్ల మనవరాలు మహాన్వికకు ట్రాక్టర్ బంపర్ తలకు తగిలింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్నారిని కుటుంబ సభ్యులు వెంటనే బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తండ్రి విశ్వనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రాలు

**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ సంకీర్త్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడంలో ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. క్రమశిక్షణ, నిజాయితీ, సేవా దృక్పథంతో విధులు నిర్వర్తించే సిబ్బందిని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని తెలిపారు. పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంపొందించేలా ప్రతి ఒక్కరూ తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. విధి పట్ల నిబద్ధతతో పనిచేసే సిబ్బందే శాఖకు ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## చోరీకి గురైన 108 సెల్‌ఫోన్ల రికవరీ.. బాధితులకు అప్పగించిన పోలీసులు

**చట్టం నిర్మల్ ప్రతినిధి :**

జిల్లాలో పోయిన, చోరీకి గురైన మొబైల్ ఫోన్ల రికవరీ కోసం చేపట్టిన ప్రత్యేక చర్యల్లో భాగంగా పోలీసులు 108 సెల్‌ఫోన్లను గుర్తించి బాధితులకు అందజేశారు. స్వాధీనం చేసుకున్న ఫోన్ల మొత్తం విలువ రూ.12.96 లక్షలు కాగా, జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బాధితులకు వాటిని అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ పోయిన లేదా చోరీకి గురైన వెంటనే ఆందోళన చెందకుండా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు CEIR పోర్టల్ (www.ceir.gov.in) లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పోర్టల్ ద్వారా పోయిన మొబైల్ ఫోన్లను గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మొబైల్ ఫోన్‌లను అజాగ్రత్తగా కోల్పోవడం వ్యక్తిగత, సామాజిక భద్రతకు ప్రమాదకరమని పేర్కొంటూ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోయిన ఫోన్ల రికవరీ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు రూ.2.70 కోట్ల విలువైన 2,250 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించినట్లు వెల్లడించారు. సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ల కొనుగోలు, విక్రయాలపై కఠిన నిఘా అవసరమని పేర్కొన్నారు. వినియోగదారులు సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనుగోలు చేసే ముందు వాటి మూలాలను పరిశీలించాలని, చోరీకి గురైన ఫోన్లను కొనుగోలు చేయకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఒకే వ్యక్తి వద్ద పెద్ద సంఖ్యలో మొబైల్ ఫోన్లు లభిస్తే వాటిపై సమగ్ర విచారణ జరపాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే, ఎవరికైనా మొబైల్ ఫోన్ దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు అప్పగించడం లేదా యజమానిని సంప్రదించి అందజేయాలని సూచించారు. మొబైల్ ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన ఐటీ కోర్ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఉపేందర్ రెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## ధన్నారంలో మద్యపాన నిషేధ ఉద్యమం ఉధృతి



**బెల్ట్ షాపుల నిర్మూలనకు గ్రామస్తుల భారీ అవగాహన ర్యాలీ**

**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :**

వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు ధన్నారం గ్రామంలో మద్యపాన నిషేధ ఉద్యమం ఉధృతమైంది. గ్రామంలో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్ట్ షాపులు, మత్తు పదార్థాల విక్రయాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్తులు మంగళవారం పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహిళలు, యువకులు, పెద్దలు, చిన్నారులు కలిసి గ్రామ వీధుల్లో పాదయాత్ర చేస్తూ "మద్యం వద్దు - ధన్నారాన్ని కాపాడుదాం", "బెల్ట్ షాపులు మూసివేయాలి" అంటూ నినాదాలు చేశారు. గ్రామంలో మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో పాల్గొన్న గ్రామస్తులు మాట్లాడుతూ మద్యం కారణంగా కుటుంబాలు ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యువత మత్తుకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. గ్రామంలో ఇకపై బెల్ట్ షాపులు, మత్తు పదార్థాల విక్రయాలను సహించబోమని హెచ్చరించారు. మహిళలు మాట్లాడుతూ మద్యం కారణంగా కుటుంబాల్లో కలహాలు పెరుగుతున్నాయని, పిల్లల చదువులు దెబ్బతింటున్నాయని తెలిపారు. కుటుంబాల సంక్షేమం, పిల్లల భవిష్యత్తు కోసం ఈ ఉద్యమంలో పాల్గొంటున్నామని చెప్పారు. ఇప్పటికే గ్రామ సభలో మద్యం విక్రయించిన వారికి రూ.5 లక్షలు, కొనుగోలు చేసిన వారికి రూ.2 లక్షల జరిమానా విధించాలని తీర్మానం చేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఆ తీర్మానానికి మద్దతుగా ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు. మత్తు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి గ్రామం ముందుకు రావాలని, ధన్నారం గ్రామ ప్రజల ఐక్యత ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు. యువత మత్తుకు దూరంగా ఉండి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

## ప్రజా సేవలో మరో మానవతా చాటింపు

**అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి రూ.2 లక్షల ఎల్ఓసీ మంజూరు**



**చట్టం న్యూస్, లింగంపేట్ :** ప్రజా సేవనే లక్ష్యంగా తీసుకుని ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుంటున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మరోసారి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. లింగంపేట్ మండలంలోని పోల్కంపేట గ్రామానికి చెందిన నడిపోల బీరయ్య తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ అత్యవసర శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించడంతో కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. వైద్య ఖర్చులతో ఇప్పటికే తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్న బీరయ్య కుటుంబం ఎమ్మెల్యేను ఆశ్రయించింది. విషయం తెలుసుకున్న వెంటనే స్పందించిన మదన్ మోహన్ రావు, చికిత్స కోసం రూ.2 లక్షల ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల సమన్వయ కమిటీ సభ్యుడు మణిగిరి నాగరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మాసుల కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తూ అవసరమైన సమయంలో తక్షణమే స్పందించడం ఎమ్మెల్యే ప్రత్యేకత అని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయాన్ని అందించడం ద్వారా ప్రజా ప్రతినిధిగా తన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. ఆర్థిక సహాయం అందడంతో బీరయ్య చికిత్సకు మార్గం సుగమమైందని కుటుంబ సభ్యులు తెలిపారు. క్లిష్ట పరిస్థితుల్లో తమకు అండగా నిలిచినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ కమిటీ సభ్యులు, బీరయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ప్రజా సేవలో భాగంగా అవసరమైన వారికి సహాయం అందిస్తూ ముందుకు సాగుతున్న మదన్ మోహన్ రావు సేవా కార్యక్రమాలు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారాయి.

## పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాటరాయుళ్ల అరెస్ట్



**చట్టం రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపాలిటీ స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని గద్దెరాగడి ప్రాంతంలో పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టణ ఎస్సై జాడి శ్రీధర్ మంగళవారం అరెస్టు చేసినట్లు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని గద్దెరాగడి ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు స్థానిక ఎస్సై సిబ్బందితో కలిసి 5 గురిని అదుపులోకి తీసుకున్నామని, పట్టుబడిన వారి దగ్గర నుండి ఒక మోటార్ సైకిల్ (3) చరవాణిలు 8 వేల 640 రూపాయలు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో 5 గురు పరారీలో ఉన్నట్టు స్థానిక ఎస్సై వివరించారు. తెలిపినారు. పరారీలో ఉన్న నిందితులను త్వరగా పట్టుకొని కోర్టులో హాజరు పరుస్తామని అన్నారు.

**బహిరంగ ప్రదేశాల్లో మద్యం చేస్తున్న యువకుల అరెస్ట్**

స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్న యువకులను స్థానిక ఎస్సై ఆధ్వర్యంలో పట్టుకున్నారు. పట్టుకున్న యువకులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి వారిపై పెట్టి కేసు నమోదు చేశారు. మరోసారి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినట్లయితే యువకులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిరోజు బహిరంగ ప్రదేశాలలో మద్యం చేస్తున్న వారిపై కొరడా జుపిస్తామన్నారు. దీనినే దృష్టిలో ఉంచుకొని యువకులు సన్మార్గంలో నడవాలని సూచించారు.

## బదిలీపై వెళ్లిన తూము రవీందర్ పటేల్‌కు ఘన సన్మానం



**చట్టం పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహించి బదిలీపై పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయానికి వెళ్లిన తూము రవీందర్ పటేల్‌కు అంతర్గాం రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శాలువాలు కప్పి, పూల బొకేలు అందజేసి ఆయన సేవలను కొనియాడారు. అంతర్గాం మండలంలో పనిచేసిన సమయంలో అందరి సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశానని తూము రవీందర్ పటేల్ తెలిపారు. ప్రస్తుతం పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ పది మండలాలకు అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నానని, అంతర్గాం మండల ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమస్య వచ్చినా తన వంతు సహకారం అందించి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై విశ్వాసం ఉంచి, ప్రత్యేకంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించిన రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, సర్పంచులు, రేషన్ డీలర్లు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోర్టు ఆదేశాలు అమలు చేయడం లేదంటూ తహసీల్దార్‌పై రైతు ఆరోపణ



**చట్టం రామాయంపేట :** మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని దౌల్తాబాద్ రోడ్డుకు సమీపంలో ఉన్న సర్వే నంబర్ 77/ఆలోని 5 ఎకరాల 10 గుంటల భూమికి సంబంధించి కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని బాధిత రైతు ఎర్రగొల్ల లక్ష్మి ఆరోపించింది. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడింది. భూమి వివాదానికి సంబంధించి 2010 సంవత్సరం నుంచి న్యాయపోరాటం కొనసాగించి చివరకు కోర్టులో అనుకూల తీర్పు పొందినట్లు తెలిపింది. కోర్టు ఆదేశాల ప్రతులను సంబంధిత అధికారులకు అందజేసి అమలు చేయాలని కోరినప్పటికీ తహసీల్దార్ స్పందించడం లేదని ఆరోపించింది. ఇక ప్రత్యర్థులు కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా భూమిలో వ్యవసాయ పనులు కొనసాగిస్తున్నారని, దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంది. కోర్టు తీర్పు ఉన్నప్పటికీ అధికారులు మౌనం పాటించడం వల్ల తమకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. భూములకు సంబంధించి చట్టబద్ధమైన అధికారాలు కలిగిన రెవెన్యూ యంత్రాంగం కోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత ఉందని, ఈ విషయంలో ఆలస్యం ఎందుకు జరుగుతోందో స్పష్టత ఇవ్వాలని ఆమె డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి కోర్టు ఆదేశాల అమలుకు చర్యలు తీసుకోవాలని బాధిత రైతు కోరింది.

## మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**చట్టం, శంషాబాద్ :** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఒక చారిత్రాత్మక నిర్ణయానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. మంగళవారం శంషాబాద్ పట్టణంలో మహిళా సంఘానికి చెందిన ఆర్టీసీ అద్దె బస్సును ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మున్ని, మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, సీనియర్ నాయకుడు చంద్రారెడ్డి, రాజు ముదిరాజ్, సర్పంచ్ మల్చలం లక్ష్మీ లింగం, వెంకటేష్ గౌడ్, యాదిరెడ్డి, మేకల వెంకటేష్, కుమార్, ప్రసాద్, ఇస్తారి, మహేందర్ రెడ్డి, దవణాకర్ గౌడ్, ప్రభాకర్, ప్రసాద్, రామ్నాథ్, బాలు, జగన్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

# వరి సాగులో హరిత విప్లవం

- **పర్యావరణాన్ని కాపాడితే నేరుగా రైతు ఖాతాల్లోకే కార్బన్ క్రెడిట్స్ నగదు బదిలీ**
- **దమ్మపేటలో ఢిల్లీ వ్యవసాయ శాస్త్రవేత్తల ప్రత్యక్ష అవగాహన సదస్సు**

**చట్టం అశ్వారావుపేట :**



సాంప్రదాయ వరి సాగులో పెట్టుబడులు నానాటికీ పెరిగిపోతూ, సాగునీటి లభ్యత తగ్గిపోతున్న ప్రస్తుత తరుణంలో దమ్మపేట మండల వరి రైతులకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంపై మార్గదర్శకత్వం లభించింది. చేంజ్ అలయన్స్, డి బి ఆర్ సి, మరియు వరాహ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో దమ్మపేట రైతు వేదికలో ఒక భారీ అవగాహన సదస్సును అత్యంత విజయవంతంగా నిర్వహించారు. దేశ రాజధాని ఢిల్లీ నుండి విచ్చేసిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు ఈ సదస్సులో పాల్గొని రైతులకు ప్రత్యక్షంగా దిశానిర్దేశం చేశారు.

**వరి సాగులో ఏ డబ్ల్యు డి విప్లవం**

ప్రస్తుత రోజుల్లో నీటి కొరత, విపరీతమైన విద్యుత్ ఛార్జీల భారం రైతులకు పెద్ద సవాలుగా మారాయి. వీటికి దీటైన పరిష్కారంగా గ్రీన్ ప్యాడీ ప్రాజెక్ట్ లో భాగంగా ప్రవేశపెట్టిన తడిపొడి సాగు పద్ధతి వరి సాగులో సరికొత్త మార్పుకు నాంది పలకనుందని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఈ పద్ధతిని అవలంబించడం ద్వారా వరి దిగుబడి ఏమాత్రం తగ్గకుండానే, అద్భుతమైన ప్రయోజనాలు పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ పద్ధతి వలన 30 శాతం నీటి పొదుపు సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే ఈ నూతన తడి పొడి సాగు విధానంలో వరి సాగుకు అవసరమయ్యే నీటి వినియోగం దాదాపు 30 శాతం వరకు తగ్గుతుంది. సాగు నీటి వినియోగం తగ్గడం వల్ల మోటార్ల వాడకం గణనీయంగా తగ్గుతుంది. దీనివల్ల కరెంట్ బిల్లులు ఆదా అవ్వడమే కాకుండా, మోటార్ల అరుగుదల ఖర్చులు తగ్గి పెట్టుబడి భారం తగ్గుతుంది. స్థిరమైన నాణ్యమైన దిగుబడి: శాస్త్రీయ పద్ధతుల ద్వారా తక్కువ నీటితోనే నాణ్యమైన, స్థిరమైన అత్యధిక వరి దిగుబడిని సాధించవచ్చని శాస్త్రవేత్తలు నిరూపించారు. రైతులకు లభించనున్న కార్బన్ క్రెడిట్స్ బోనస్! ఈ ప్రాజెక్టులోని అత్యంత ఆకర్షణీయమైన అంశమన్నారు. పర్యావరణ పరిరక్షణతో కూడిన అదనపు ఆదాయం. తడి పొడి సాగు పద్ధతి ద్వారా భూమి నుండి వాతావరణంలోకి విడుదలయ్యే ప్రమాదకర మిథేన్ ఉద్గారాలను 48 శాతం వరకు తగ్గించవచ్చు. ఇలా పర్యావరణాన్ని కాపాడుతూ వరి పండించే రైతులకు 'కార్బన్ క్రెడిట్స్' రూపంలో ప్రభుత్వం మరియు అంతర్జాతీయ సంస్థల నుండి నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకే అదనపు నగదు ప్రోత్సాహకం (బోనస్ ఆదాయం) అందుతుందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. అశ్వారావుపేట మండలంలోని వరి రైతులందరూ, ముఖ్యంగా ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించాలనుకునే ప్రతీ ఒక్క రైతు సోదరుడూ ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహక సంస్థలైన చేంజ్ అలయన్స్, డి.వి.ఆర్.సి మరియు వరాహ ప్రతినిధులు ఢిల్లీ వ్యవసాయ శాస్త్రవేత్త బాసబ్, ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, బాబ్జి, అఖిల్ మల్హోత్రా, ఆశిష్ లు పిలుపునిచ్చారు. రైతులు ఆధునిక సాంకేతికతను తెలుసుకొని, లాభాల బాట పట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరాహ సంస్థ నుండి అఖిల్ మల్హోత్రా, ఆశిష్, చేంజ్ అలయన్స్ సంస్థ నుండి బాసబ్, డిబిఆర్సి సంస్థ నుండి ఉమామహేశ్వరరావు, బాబ్జి, ఫీల్డ్ కోఆర్డినేటర్లు గుల్ల రాంబాబు వాడపల్లి రవి బాబు, నూనె హనుమంతరావు, ఉదయ రాఘవేంద్ర మాజీ ఎంపీటీసీ కాసిని శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కుంజా సూరిబాబు, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వరరావు వందలాది మంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని, శాస్త్రవేత్తలను అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## ముధోల్ నియోజకవర్గ బీఎస్పీ ఇంచార్జ్‌గా పవార్ లక్ష్మణ్ నియామకం



**చట్టం, భైంసా :** నిర్మల్ జిల్లాలోని ముధోల్ నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఇంచార్జ్‌గా పవార్ లక్ష్మణ్‌ను నియమించారు. తానూర్ మండల కేంద్రానికి చెందిన పవార్ లక్ష్మణ్ గతంలో బీఎస్పీలో కార్యదర్శి, ఉపాధ్యక్షుడిగా పలు బాధ్యతలు నిర్వహించారు. నేటి నుంచి ముధోల్ నియోజకవర్గ బీఎస్పీ ఇంచార్జ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ నిర్ణయం మేరకు నియోజకవర్గ అధ్యక్షుడిగా కూడా కొనసాగనున్నట్లు నిర్మల్ జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు అడ్వకేట్ జగన్ మోహన్ వెల్లడించారు. ఈ సందర్భంగా పవార్ లక్ష్మణ్ మాట్లాడుతూ, బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుల ఆశయాలు, పార్టీ జాతీయ నాయకత్వం నిర్దేశించిన విధానాలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, దళితుల సంక్షేమం, సామాజిక న్యాయం కోసం కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలో దళితులు, వెనుకబడిన వర్గాలపై జరిగే అన్యాయాలను అరికట్టేందుకు పార్టీ తరఫున ముందుండి పోరాటం చేస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక సమానత్వం సాధన కోసం శాయశక్తులా పనిచేస్తానని పేర్కొన్నారు. పవార్ లక్ష్మణ్ నియామకంపై పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణలో స్థానిక ప్రజల భాగస్వామ్యం కీలకం: సతీష్ కుమార్




**చట్టం, పెద్దపల్లి :** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా పెద్దపల్లి జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, అటవీ ఉత్పత్తుల వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు అటవీ శాఖ రేంజ్ అధికారి సతీష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాల సందర్భంగా అంతర్గాం మండలం కుందన్‌పల్లి, మంథని మండలం ఖాన్సాపేట్ గ్రామాల్లో గ్రామస్తులకు పర్యావరణ పరిరక్షణ, అటవీ ఉత్పత్తుల సద్వినియోగం, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. కుందన్‌పల్లి అర్బన్ ఫారెస్ట్ పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో చీపురు గడ్డి, తేనె, జిగురు, ఇప్ప పూలు వంటి అటవీ ఉత్పత్తుల విలువ ఆధారిత వినియోగంపై వివరించారు. అలాగే వర్మీ కంపోస్ట్ తయారీ పద్ధతులపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బందితో పాటు 62 మంది గ్రామస్తులు పాల్గొన్నారు. ఖాన్సాపేట్ గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అటవీ ఉత్పత్తుల సేకరణలో పాటించాల్సిన శాస్త్రీయ విధానాలు, వర్మీ కంపోస్ట్ తయారీ ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలపై వివరించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ హాజరయ్యారు. అటవీ శాఖ సిబ్బందితో పాటు 38 మంది గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, అడవులపై ఆధారపడి జీవించే ప్రజలు అటవీ ఉత్పత్తులను సేకరించే సమయంలో పర్యావరణానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అడవుల సంరక్షణతో పాటు సేంద్రీయ ఎరువుల తయారీ వంటి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అభివృద్ధి చేసుకోవాలని గ్రామస్తులను ప్రోత్సహించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో స్థానిక ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో కొమురయ్య, తిరుపతి, నర్సయ్య, రవి, శ్రీకాంత్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## భక్తి తరంగాల్లో తేలిన వెంకటాపూర్

**డప్పుల దరువులు.. బోనాల ఊరేగింపుతో గ్రామమంతా పండుగ శోభ**



**చట్టం / ఎల్లారెడ్డి:** డప్పుల దరువులు, శివసత్తుల విన్యాసాలు, భక్తుల జైజై ధ్వానాలతో మండలంలోని వెంకటాపూర్ గ్రామం మంగళవారం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. గ్రామ ఆరాధ్య దేవతలైన ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మ, గంగమ్మ తల్లులకు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపుతో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. రంగురంగుల సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు బోనాలు ఎత్తుకుని అమ్మవార్ల ఆలయాలకు చేరుకోగా, డప్పు వాయిద్యాల మోతలు, శివసత్తుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామ వీధుల గుండా సాగిన బోనాల ఊరేగింపును చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి గ్రామ శ్రేయస్సు కోసం ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అయ్యల సాయిలు మాట్లాడుతూ... గ్రామ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, పంటల సమృద్ధి, గ్రామాభివృద్ధి కోసం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామ సంప్రదాయాలను కాపాడుకుంటూ భక్తి భావంతో ప్రతి ఒక్కరూ ఉత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పంతులు మహేందర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.

## ధారూర్‌లో ఫర్టిలైజర్ దుకాణాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- **స్టాక్ రిజిస్టర్లు, ధరల పట్టికల పరిశీలన**
- **అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**



**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతులకు ఎరువుల సరఫరా సక్రమంగా జరుగుతున్నదా, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయాలు జరుగుతున్నాయా అనే అంశాలపై వికారాబాద్ జిల్లా కలెక్టర్ మంగళవారం ధారూర్ మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో నిర్వహిస్తున్న స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, ధరల పట్టికలను పరిశీలించారు. అలాగే పాయింట్ ఆఫ్ సేల్ (PoS) యంత్రాల్లో నమోదవుతున్న వివరాలను భౌతికంగా ఉన్న ఎరువుల నిల్వలతో సరిపోల్చి తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, విక్రయాల నమోదులో ఎలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దుకాణ నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని, ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు అందించాలని ఆదేశించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే విధంగా అధిక ధరలకు ఎరువులు విక్రయించడం, బిల్లులు ఇవ్వకుండా అమ్మకాలు నిర్వహించడం, నిల్వలను దాచిపెట్టడం వంటి చర్యలు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఎరువుల నిల్వలను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటనకు ఘన ఏర్పాట్లు

**జాకోర-చందూర్ ఎత్తిపోతల పథకాల ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం**



**చట్టం న్యూస్ మోస్రా :** నిజామాబాద్ జిల్లా వర్ని మండలం బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో రూ.106 కోట్ల వ్యయంతో నిర్మించిన జాకోర, చందూర్ ఎత్తిపోతల పథకాల ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల 10వ తేదీ బుధవారం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ పథకాలను ప్రారంభించనున్నారు. అదే సందర్భంగా సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. హెలిప్యాడ్ స్థలం, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, ఇతర వసతులను తనిఖీ చేస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పరిశీలన కార్యక్రమంలో వర్ని ఉమ్మడి మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్ కుల్కర్ణి సురేష్ బాబా, డీసీసీ డెలిగేట్ డాక్టర్ కునీపూర్ రాజ్ రెడ్డి, జిల్లా డీసీసీ కార్యదర్శి గోపాల్, కాంగ్రెస్ నాయకులు రంజా నాయక్, కలాల్ గిరి, మాజీ కోఆప్షన్ సభ్యుడు కరీం, వర్ని, చందూర్ మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. బాన్సువాడ నియోజకవర్గ సాగునీటి అభివృద్ధిలో జాకోరచందూర్ ఎత్తిపోతల పథకాల ప్రారంభోత్సవం మరో చారిత్రాత్మక ఘట్టంగా నిలవనుందని నాయకులు పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే గుణాత్మక విద్య



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలలోనే గుణాత్మక విద్య అందుతుందని మహా ముత్తారం మండలము స్తంభం పల్లి గ్రామ సర్పంచ్ జంగిడి కీర్తన శ్రీనివాస్ అన్నారు. ములుగు పల్లి ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమం లో భాగంగా స్తంభం పల్లి (పి పీ )లో బడి బాట కరపత్రాలు గ్రామం లోని తల్లి దండ్రులకు అందచేసి ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ కీర్తన శ్రీనివాస్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలోనూ ఉండాలని ములుగు పల్లి ఉన్నత పాఠశాలలో అంకితభావం అనుభవం గల ఉపాధ్యాయులచే విద్యాబోధన కొనసాగుతుందని రుచికరమైన మధ్యాహ్న భోజనం వారానికి మూడు కోడిగుడ్లు రాగి జావా పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు రెండు జతల యూనిఫామ్స్ బాలబాలికలకు ప్రత్యేకమైన పరిశుభ్రమైన మరుగుదొడ్లు పాఠశాల వ్యాయామ విద్య ,సైన్స్ క్లబ్ ప్రయోగాల ద్వారా విద్యాబోధన సాగుతోంది అని ఇక్కడి గ్రామం లో అయిదవ తరగతి పూర్తి అయిన విద్యార్థులు ఆరో తరగతికి ములుగు పల్లి ఉన్నత పాఠశాలకు వచ్చేలా కృషి చేస్తానని అన్నారు. బయాలజీ టీచర్ కామిడి సతీశ్ రెడ్డి మాట్లాడుతూ ములుగు పల్లి లో టెన్త్ ఫలితాలలో అందరు ఉత్తీర్ణత సాధించి మండల స్థాయిలో టాపర్ గా నిలిచారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు గ్రామాల్లోని పిల్లలను పంపడం మీ బాధ్యతగా భావించి పంపాలని వారిని ఉన్నతమైన ఉత్తమమైన పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత తమదేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పోడేటి వెంకటేష్ స్తంభం పల్లి యూత్ నాయకులు పసుల రామ్, జాడి అజయ్, చరణ్, పసుల రాజ్ కుమార్, రాజేంద్ర ప్రసాద్, సూడిది ప్రవీణ్, పసుల రమేష్ రామ్ చరణ్ శివ కుమార్ పాల్గొన్నారు.

## అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోంది : పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**చట్టం అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార అండ్ పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు దిశా కమిటీ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు రామసహాయం రఘురాం రెడ్డి, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో విస్తృత పర్యటన నిర్వహించి పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ముందుగా ఆదివాసీ కొండరెడ్డి గిరిజన గ్రామాలైన పూసుగూడెం, కట్కూరులో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం పట్వారిగూడెం నుండి పాకలగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి స్థానిక రైతు వేదికలో రాచూరుపల్లి, మల్లారం గ్రామాలకు చెందిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు అర్హత పత్రాలను అందజేశారు. అలాగే పట్వారిగూడెంలో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు (నాయుడుపేట) మొద్దులగూడెం గ్రామంలో రైతులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు రెడ్యాలపాడు వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి మొద్దులగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. అనంతరం అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో పర్యటించి కొమరం భీం అర్బన్ ఎకో పార్క్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ అయిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అలాగే కొత్తమామిళ్లవారిగూడెం గ్రామానికి చెందిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందజేసి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, అశ్వారావుపేట మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ రమేష్, జిల్లా మండల స్థాయి ఉన్నతాధికారులు, జిల్లా మండల స్థాయి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,అభిమానులు, అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## భారీగా పెంచిన జాబ్ అప్లికేషన్ ఫీజులను వెంటనే తగ్గించాలి

- **ఉచితంగా అప్లికేషన్ పెట్టుకునే అవకాశం కల్పించాలి**
- **బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు**

**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :**



నిరుద్యోగ యువకులు ఉద్యోగాల కోసం పెట్టే అప్లికేషన్ ఫీజులు రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచడాన్ని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్రంగా ఖండించారు. వెంటనే పెంచిన ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిరుద్యోగ యువకులు ఉద్యోగాల కోసం అప్లై చేయడానికి ప్రస్తుతమున్న 200 రూపాయల అప్లికేషన్ ఫీజును ఓసి బీసీలకు వెయ్యి రూపాయలకు పెంచడం, ఎస్సీ ఎస్టీ వికలాంగులకు 500 రూపాయలకు పెంచడమంటే నిరుద్యోగ యువతీ యువకుల జీవితాలతో చెలగాట మాడటమేనన్నారు. ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో పెంచడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై భారం పెరుగుతున్నదన్నారు. ఒక నిరుద్యోగి ఐదు రకాల పోటీ పరీక్షలకు అప్లై చేయాలంటే ఐదువేల రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి ఉందన్నారు. బీసీ ఎస్సీ ఎస్టీ బడుగు బలహీన వర్గాలు చెందిన నిరుద్యోగ అభ్యర్థులు హైదరాబాదులో కోచింగ్ సెంటర్ల లో వేలాది రూపాయల ఫీజులు చెల్లిస్తూ అనేక ఇబ్బందులు పడుతున్న విషయం ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. రైతు కూలీలు, కార్మికులు సామాన్య ప్రజలు అనేక ఆర్థిక ఇబ్బందులలో ఉండి అప్పులు చేసి తమ పిల్లలను కోచింగ్ సెంటర్లో కోచింగ్ ఇప్పించడానికే బాధపడుతుంటే జాబ్ అప్లికేషన్ ఫీజులు అడ్డగోలుగా పెంచడం దుర్మార్గంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ శాసనసభ ఎన్నికల ముందు ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగ యువకులు పోటీ పరీక్షల కోసం అప్లై చేసే వారి నుండి ఫీజులు వసూలు చేయడాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీని విస్మరించి నిరుద్యోగ యువకులను దగా చేయడమేంటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వము పెట్రోల్ డీజిలు వంట గ్యాసు ధరలు మాటిమాటికి పెంచి ప్రజల నడ్డి విరుస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం జాబ్ అప్లికేషన్ ఫీజులు పెంచుతూ ప్రజలపై భారాలను మోపడంలో కేంద్ర ప్రభుత్వంతో పోటీపడుతున్నదన్నారు. కేంద్ర రాష్ట్ర పాలకుల విధానాలతో పేద సామాన్య మధ్యతరగతి ప్రజల జీవితాలు దుర్భరంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమది ప్రజా పాలన అని గొప్పగా ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం వెంటనే ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు. అభయహస్తం లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువకులందరికి ఉద్యోగాల కోసం ఉచితంగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిచో ప్రజలు తగిన సమయంలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## పేద విద్యార్థులకు శాపంగా మారిన నవోదయ కోచింగ్ సెంటర్లు




- **లాంగ్‌టర్మ్ కోచింగ్ పేరుతో లక్షల్లో ఫీజుల దోపిడీ**
- **ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉచిత శిక్షణ ఇవ్వాలని డిమాండ్**

**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)**

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన 'జవహర్ నవోదయ విద్యాలయాల' ప్రవేశానికి వేల సంఖ్యలో విద్యార్థులు పోటీ పడుతున్నారు. దీన్ని అవకాశంగా తీసుకుంటున్న ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు లాంగ్‌టర్మ్ కోచింగ్ పేరుతో లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ పేదలకు శాపంగా మారుతున్నాయి. నవోదయ ప్రవేశ పరీక్షలో సీటు సాధించడం కోసం ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు పేద తల్లిదండ్రుల నుంచి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ వారిని ఆర్థికంగా నిండా ముంచుతున్నాయి.

**పేదలకు భారంగా కోచింగ్ సెంటర్లు**

- భారీ ఫీజుల దోపిడీ*: 5వ తరగతి చదివే పిల్లలకు ప్రవేశ పరీక్షలో సీటు ఇప్పించేందుకు ప్రైవేట్ సంస్థలు నెలకు వేలల్లో వసూలు చేస్తున్నాయి. వసతి గృహాలతో కలిపి సంవత్సరానికి లక్షల రూపాయల వరకు ఖర్చవుతోంది.
- అప్పుల పాలు*: వ్యవసాయం, కూలి పనులపై ఆధారపడే గ్రామీణ పేద తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసి, ఆస్తులు అమ్మి మరీ ఈ ఫీజులు చెల్లిస్తున్నారు.
- భయం సృష్టిస్తున్నాయి*: నవోదయ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ప్రవేశం కల్పించాలని నిబంధనలు ఉన్నప్పటికీ, కోచింగ్ సెంటర్లు లేనిదే పరీక్ష పాస్ కాలేరనే అపోహను సృష్టించి వ్యాపారం చేస్తున్నాయి.
- చిన్న వయస్సులోనే ఒత్తిడి*: 14 ఏళ్లలోపు విద్యార్థులను హాస్టళ్లలో ఉంచి, ఆటపాటలు దూరం చేసి కేవలం పరీక్షల కోసమే చదివించడం వారి మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

**నవోదయ విద్యాలయాల అసలు లక్ష్యం**

నిజానికి, నవోదయ విద్యాలయాల్లో విద్య, భోజనం, పుస్తకాలు, యూనిఫాం వంటివన్నీ పూర్తిగా ఉచితం. ఎస్సీ, ఎస్టీ, బాల బాలికలు, బీపీఎల్ కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఎలాంటి ఫీజులు ఉండవు. 10+2 విధానంలో ఇక్కడ విద్య ఉంటుంది. ఇక్కడ చదివిన విద్యార్థులు కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన రికార్డు ఉంది. కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్‌లో నవోదయ విద్యాలయం ఉంది. ప్రతి ఏడాది నవోదయలో ప్రవేశానికి ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది వరకు ఐదవ తరగతి విద్యార్థులు పరీక్ష రాస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాల్సి ఉండగా, నేడు జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి తదితర ప్రాంతాల్లో ప్రత్యేకంగా కోచింగ్ సెంటర్లు వెలిశాయి. అవగాహన లేకపోవడంతో చాలా మంది పేదలు ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల ఉచ్చులో పడుతున్నారు. నిరుపేదలకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించాలనే ప్రభుత్వ ఆశయానికి కోచింగ్ మాఫియా పెద్ద అవరోధంగా మారింది. ప్రభుత్వాలు, అధికారులు స్పందించి గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లోనే నవోదయ ప్రవేశ పరీక్షలకు తగిన శిక్షణ లభించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యావేత్తలు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**చట్టం, ముప్కాల్ :** ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామంలో మంగళవారం ఉదయం కళ్యాణలక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ దాసరి గంగాధర్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రాంధేని లిఖిత, వడ్డేపల్లి అమూల్య, చందూరి సుప్రియలకు కళ్యాణలక్ష్మి పథకం చెక్కులు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వసంత్ రావు, ఆర్ఐ రవి, జీపీవో చందు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కమిషనర్‌కి వినతిపత్రం అందజేసిన కౌన్సిలర్ దీప్తి రాకేష్ రావు



**చట్టం / పరకాల :** పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో ఉన్న డ్రైనేజీ సమస్యలను, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తలెత్తబోయే ఇబ్బందులను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ 14వ వార్డు కౌన్సిలర్ కొక్కిరాల దీప్తి రాకేష్ రావు మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్ ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కొక్కిరాల దీప్తి రాకేష్ రావు మాట్లాడుతూ.. వార్డులోని పలు వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల మురుగునీరు రోడ్లపైకి చేరుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వర్షపు నీరు నిలవకుండా మురుగు కాల్వలకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ సమస్యలపై మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్ సానుకూలంగా స్పందించారని, వర్షాకాలం ప్రారంభం కాకముందే యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్ తెలిపారు. వార్డు ప్రజల ఆరోగ్య రక్షణ, సౌకర్యాలే ధ్యేయంగా తాము నిరంతరం శ్రమిస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాడి భగవాన్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు ఇంగిలి వీరేష్ రావు, బియబాని,నాగరాజు,కృపేందర్ రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక జాలి మిషన్ పంపిణీ



**చట్టం న్యూస్, లింగంపేట్ :** మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు అవసరమైన ఇసుకను శుద్ధి చేసేందుకు ఇసుక జాలి మిషన్‌ను మంగళవారం అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సహకారంతో గ్రామ ఉపసర్పంచ్ మన్నే బాలయ్య ఈ మిషన్‌ను గ్రామానికి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అట్టెం శ్రీనివాస్ యాదవ్ మిషన్‌ను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు నిర్మాణ పనులు వేగవంతంగా సాగేందుకు ఈ మిషన్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రవి, వార్డు సభ్యులు అశోక్, అంజా గౌడ్, మల్లయ్య, చల్ల మల్లయ్య, జె. రాములు, గ్రామస్తులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో నిర్మాణ పనులకు అవసరమైన ఇసుకను సులభంగా సిద్ధం చేసుకోవడానికి ఈ మిషన్ దోహదపడనుందని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

## వరి లోడ్ తీసుకోని రైస్ మిల్లర్.. రైతులకు ఇబ్బందులు

**సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టరేట్ ముందు ధర్నా: రైతుల హెచ్చరిక**





**(చట్టం ప్రతినిధి కామారెడ్డి):** కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఆరెపల్లి గ్రామంలో వరి కొనుగోలు చేసిన తర్వాత రైస్ మిల్లర్ లారీ లోడ్ తీసుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం డ్యామేజ్ అయిందని సాకు చెబుతూ మిల్లుకు చెన్నె పంపించడం లేదని, దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సబ్బిడి రమేష్, టీఆర్‌పీ కామారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శి శ్రీకాంత్ ఆరెపల్లి గ్రామానికి చేరుకున్నారు. రైతులు, రైస్ మిల్లర్, అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. రైస్ మిల్లర్ వైఖరితో పంట చేతికందక, డబ్బులు రాక రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారని టీఆర్‌పీ నేతలు తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రేపు కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తామని రైతులు హెచ్చరించారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

## సంచులకోసం రోడ్డేకిన జొన్న రైతులు

**రోడ్డు పై బైఠాయించిన రైతన్నలు,నిలిచిన వాహనాలు**



**చట్టం నారాయణఖేడ్ :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండల పరిధిలోని తడ్కల్ గ్రామంలో మంగళవారం జొన్నల కొనుగోలు కేంద్రం వద్ద రైతన్నలు కంగ్టి పిట్లం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు గోనే సంచుల, లారీల కొరతతో, అకాల వర్షానికి జొన్నలు తడిసి మొలకెత్తడంతో రైతులు ఆందోళన చెంది ధర్నా నిర్వహించి, ప్రభుత్వంపై వ్యతిరేక నినాదాలు చేశారు. లారీల కొరత గోనే సంచుల కొరతను తీర్చాలని రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రభుత్వానికి, ప్రభుత్వ అధికారులకు, డిమాండ్ చేస్తున్నారు. ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతన్నలను కంగ్టి ఎస్ఐ దుర్గారెడ్డి, మాట్లాడి ప్రధాన రహదారిపై నిలిచిన వాహనాలను పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో తడ్కల్ పరిసర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## జస్టిస్ బాలకృష్ణన్ బేటిలో పాల్గొన్న రమేష్ జాన్

**చట్టం ఆర్మూర్:** ఢిల్లీలోని జాతీయ విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ కె.జి. బాలకృష్ణన్‌తో బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల బృందం జరిపిన సమావేశంలో ఆర్మూర్ మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ జాన్ పాల్గొన్నారు. దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలనే ప్రధాన డిమాండ్‌పై ఈ సమావేశం జరిగింది. ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన ఒక నివేదికను కమిషన్ చైర్మన్‌కు బిఆర్ఎస్ ప్రతినిధులు, రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పార్టీ జనరల్ సెక్రటరీ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్ లు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ జాన్ మాట్లాడుతూ, జస్టిస్ బాలకృష్ణన్ బేటిలో బిఆర్ఎస్ పార్టీ క్రైస్తవ సంక్షేమం కోసం నివేదిక ఇవ్వడం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిబద్ధతకు నిదర్శనం అన్నారు. ఇదే విషయమై ఇతర రాజకీయ పార్టీల మౌనం వహించడంపై ధ్వజమెత్తారు. అలాగే క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాణిక్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత క్రైస్తవుల సంక్షేమం కోసం పాటుపడిన ఘనత బిఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ నాయకులు బిషప్ విద్యాసాగర్, మోజెస్, సాలోమోన్, బిషప్ దుర్గం ప్రభాకర్ లతోపాటు పలువురు పాల్గొన్నారు.




## మున్సిపల్ పరిపాలనా వైఫల్యాలను ఎత్తి చూపితే మీడియాపై అక్కసు






- **చైర్‌పర్సన్ ఛాంబర్‌లోకి మీడియాకు నో ఎంట్రీ..!**
- **ఆర్మూర్‌లో పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలా..?**
- **ప్రజా ప్రతినిధి కార్యలయమా..? వ్యక్తిగత కార్యాలయమా..?**
- **జర్నలిస్టులకు అనుమతి పత్రం తప్పనిసరి అంటూ కొత్త ఖానూన్..!**

**చట్టం ఆర్మూర్:**

దేశంలోనే ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా గుర్తింపు పొందిన పత్రికా మీడియా పైనే ఆంక్షలు విధించే ప్రయత్నం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపాలిటీలో వివాదాస్పదంగా మారింది. ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గోనె లహరి, తన ఛాంబర్ లోనికి (జర్నలిస్టులు) పాత్రికేయులు రావాలంటే ముందుగా తన అనుమతి తీసుకోవాలని, అనుమతి లేకుండా లోపలికి ప్రవేశించవద్దని అటెండర్ ద్వారా తెలియజేయడం జర్నలిస్టు వర్గాల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. ఆర్మూర్ మున్సిపాలిటీ ఏర్పడిన 17 ఏళ్ల చరిత్రలో ఎన్నో పాలకవర్గాలు మారినా, ఏ మున్సిపల్ చైర్‌పర్సన్ కూడా మీడియా ప్రతినిధుల ప్రవేశంపై ఏలాంటి ఆంక్షలు విధించిన సందర్భాలు లేవని (జర్నలిస్టులు) పాత్రికేయులు పేర్కొంటున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడం, ప్రజా ప్రతినిధుల పనితీరును ప్రజలకు తెలియజేయడం ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా మీడియా బాధ్యతగా వ్యవహరిస్తుంది. ఇప్పుడు మీడియానే అనుమతుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి తీసుకురావడం ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తోందని సీనియర్ పాత్రికేయులు అంటున్నారు. ప్రజల పన్నుల డబ్బుతో నడిచే మున్సిపల్ కార్యాలయం ప్రభుత్వ ఆస్తి అని, దానిని వ్యక్తిగత కార్యాలయంలా భావించి మీడియాపై ఆంక్షలు విధించడం సరైన పద్ధతి కాదని (జర్నలిస్టులు) సీనియర్ పాత్రికేయులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ హోదా ప్రజలకు సేవ చేయడానికి తప్ప అధికార మదం ప్రదర్శనకు కాదని గుర్తు చేస్తున్నారు. మొన్న కౌన్సిలర్, నేడు చైర్‌పర్సన్, రేపు ఇంకెవరో..?" అంటూ (జర్నలిస్టులు) పాత్రికేయులు మండిపడుతున్నారు. వార్త సేకరణ, వార్తలు రాయడం జర్నలిస్టుల రాజ్యాంగ బద్ధమైన హక్కు, వృత్తి ధర్మం అని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడాన్ని ఎవరూ అడ్డుకోలేరని స్పష్టంగా వ్యక్తం చేశారు. జర్నలిస్టులతో పెట్టుకున్న వారు రాజకీయంగా, ప్రజల్లో ఎప్పుడూ లాభపడట్టు చరిత్రలో లేదని చెబుతోంది అని పలువురు సీనియర్ జర్నలిస్టులు వ్యాఖ్యానిస్తున్నారు. మీడియాను దూరం పెట్టడం ద్వారా ప్రజల గొంతును అణచివేయలేరని హెచ్చరిస్తున్నారు. ఆర్మూర్ మున్సిపాలిటీలో చోటుచేసుకున్న ఈ పరిణామంపై జర్నలిస్టు సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు స్పందించి చైర్‌పర్సన్ వైఖరిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు పారదర్శకతను పాటించాలే తప్ప పత్రికా స్వేచ్ఛపై అనుమానాలు కలిగించే చర్యలకు పాల్పడకూడదని అభిప్రాయపడుతున్నారు.

## నాయి బ్రాహ్మణుల వృత్తి సమాజానికి ఆదర్శం

**సంప్రదాయాన్ని కాపాడుతూ ఆధునికత వైపు అడుగులు**

**చట్టం/పరకాల**



నాయి బ్రాహ్మణుల వృత్తి భారతీయ సమాజంలో అత్యంత పురాతనమైన, గౌరవనీయమైన వృత్తులలో ఒకటిగా కొనసాగుతోంది. ప్రజల వ్యక్తిగత పరిశుభ్రత, సామాజిక సేవ మరియు సంప్రదాయ ఆచార వ్యవహారాలలో ఈ వర్గం అందిస్తున్న సేవలు విశేషమైనవి. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు నాయి బ్రాహ్మణులు తమ నైపుణ్యంతో ప్రజల అభిమానాన్ని పొందుతున్నారు. పూర్వం నుంచి వివాహాలు, ఉపనయనాలు, ధార్మిక కార్యక్రమాలు మరియు ఇతర శుభకార్యాలలో నాయి బ్రాహ్మణుల పాత్ర కీలకంగా ఉండేది. నేటికీ అనేక ప్రాంతాల్లో ఈ సంప్రదాయం కొనసాగుతుండటం విశేషం. సమాజంలోని ప్రతి వర్గానికి సేవలు అందిస్తూ ప్రజలతో సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నాయి బ్రాహ్మణ యువత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని కొత్త అవకాశాలను సృష్టించుకుంటున్నారు. ఆధునిక సెలూన్లు, బ్యూటీ పార్లర్లు, హెయిర్ స్టైలింగ్ సెంటర్లు మరియు గ్రూమింగ్ అకాడమీలను స్థాపిస్తూ స్వయం ఉపాధి రంగంలో ముందుకు సాగుతున్నారు. దీంతో యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు వృత్తికి కొత్త గుర్తింపు లభిస్తోంది. ఈ వృత్తి కేవలం జీవనోపాధి మాత్రమే కాకుండా సమాజ ఆరోగ్యం, పరిశుభ్రత మరియు వ్యక్తిత్వ వికాసానికి కూడా దోహదపడుతోంది. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా నాయి బ్రాహ్మణులు సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నారని పలువురు సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, ఆర్థిక రుణాలు, ఉపకరణాల సబ్సిడీలు మరియు విద్యా సదుపాయాలు కల్పించడం ద్వారా నాయి బ్రాహ్మణుల అభివృద్ధికి మరింత తోడ్పాటు అందించాలని సంఘ నాయకులు కోరుతున్నారు. ఈ వర్గం అభివృద్ధి చెందితే దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా గణనీయమైన సహకారం అందించగలదని వారు పేర్కొన్నారు. నాయి బ్రాహ్మణుల సంప్రదాయం, సేవా భావం మరియు కష్టపడే తత్వం సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. వృత్తి గౌరవాన్ని కాపాడుకుంటూ ఆధునికతతో ముందుకు సాగుతున్న నాయి బ్రాహ్మణులకు ప్రభుత్వం, సమాజం నుంచి మరింత ప్రోత్సాహం అందాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

**(శివకుమార్ ఓదెల జర్నలిస్ట్ పరకాల)**

## దేశ భక్తి భావాన్ని అందరిలో పెంచే ప్రతిజ్ఞ

**ప్రతీ ఒక్కరిలో దేశం పట్ల అభిమానాన్ని పెంచే ప్రతిజ్ఞ అందరిలో స్ఫూర్తి కలుగిస్తుంది**

పైడిమర్రి వెంకటసుబ్బారావు 10 జూన్ 1916 లో జన్మించారు . వీరు నల్గొండ జిల్లా, అన్నెపర్తికి చెందిన రచయిత, బహుభాషావేత్త. భారత జాతీయ ప్రతిజ్ఞ (భారతదేశం నా మాతృభూమి...) రచయిత.

పైడిమర్రి సుబ్బారావుపైడిమర్రి రాంబాయమ్మ, వెంకవూటామయ్య దంపతులకు నల్లగొండ కేంద్రానికి అతి సమీపంలో ఉండే అన్నెపర్తిలో జన్మించారు. విద్యాభ్యాసం మొత్తం అన్నెపర్తి, నల్లగొండలోనే సాగింది. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో నిష్ణాతులు. హైదరాబాద్ రాష్ట్రంలోనే ట్రెజరీ విభాగంలో ప్రభుత్వోద్యోగం సంపాదించారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక ఖమ్మం, నిజామాబాద్, నెల్లూరు, విశాఖపట్నం, నల్లగొండ జిల్లాల్లో పనిచేశారు. ఆయన 1962 లో విశాఖపట్నం ట్రెజరీ అధికారిగా ఉన్నపుడు ఈ ప్రతిజ్ఞ తయారు చేశాడు. భారత్‌చైనా యుద్ధం జరుగుతున్న సమయమది. ఆ యుద్ధం పూర్తయిన తర్వాత చైనా ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంది. తమ దేశ ప్రజల్లో ప్రాథమిక దశ నుంచే దేశభక్తి భావం నూరిపోయాలని..! ఆ మేరకు ప్రత్యేకంగా కొన్ని దేశభక్తి గేయాలను రాయించి, పాఠశాల విద్యార్థులతో చదివించడం మొదలుపెట్టింది. అప్పటికే విదేశీ భాషల్లో ప్రావీణ్యం ఉన్న పైడిమర్రి ఈ విషయం గుర్తించాడు. మన దేశ విద్యార్థుల్లోనూ దేశభక్తిని పెంపొందించడానికి గేయాలుంటే బాగుంటుందని భావించాడు. పలు రచనలు చేసిన అనుభవంతో ఆ ఆలోచనకు రూపమివ్వడం మొదలుపెట్టాడు. ప్రతిజ్ఞకు పదాలు కూర్చాడు. విశాఖ సాహితీ మిత్రుడు తెన్నేటి విశ్వనాధంతో చర్చించాడు. 'వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలము' అన్న వాక్యాన్ని అదనంగా చేర్చాడు. అంతాబాగానే ఉంది కానీ, దాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. పాఠ్యపుస్తకాల్లో చేర్చడం ఎలా అని ఆలోచించారు అప్పుడు కాసు బ్రహ్మానందడ్డి ప్రభుత్వం. అప్పటి విద్యాశాఖ మంత్రి విజయనగరం రాజాగా పేరుగాంచిన పీవీజీ రాజు. ఆయన సాహితీవేత్త కావడం వారికి కలిసొచ్చింది. తేన్నేటి సాయంతో ప్రతిజ్ఞను పీవీజీ రాజు దృష్టికి తీసుకెళ్లాడు. దాని విలువను, అవసరాన్ని వివరించి ఓ ప్రతిని అందజేశారు. 1964లో బెంగుళూరులో ప్రముఖ న్యాయనిపుణుడు మహ్మద్ కరీం చాగ్లా అధ్యక్షతన కేంద్రీయ విద్యా సలహామండలి సమావేశం జరిపినపుడు జాతీయ ప్రతిజ్ఞగా స్వీకరించారు. తరువాత దీన్ని అన్ని భాషల్లోకి అనువాదం చేయించి 1965 జనవరి 26 నుంచి దేశమంతటా చదువుతున్నారు. పైడిమర్రి రాసిన ప్రతిజ్ఞలో కాలానుగుణంగా కొన్ని స్వల్ప మార్పులు మాత్రం జరిగాయి. గ్రాంథికంలో కొన్ని పదాల స్థానంలో వాడుక భాష వాడారు. ఇతర భాషల్లోకి అనువదించి 1963 నుంచి దేశ ప్రతిజ్ఞగా అమలులోకి వచ్చింది.

భారతదేశం నా మాతృభూమి.
భారతీయులందరూ నా సహోదరులు.
నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను.
సుసంపన్నమైన, బహువిధమైన నాదేశ వారసత్వసంపద నాకు గర్వకారణం.
దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను.
నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్నీ గౌరవిస్తాను.



ప్రతివారితోను మర్యాదగా నడచుకొంటాను. జంతువుల పట్ల దయతో ఉంటానునా దేశం పట్ల, నా ప్రజల పట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి భారతదేశము నా మాతృభూమి. భారతీయులందరు నా సహోదరులు. నేను నా దేశమును ప్రేమించుచున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నాదేశ వారసత్వసంపద నాకు గర్వకారణము. దీనికి అర్హుడనగుటకై సర్వదా నేను కృషి చేయుదును. నా తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, పెద్దలందరిని గౌరవింతును.
ప్రతివారితోను మర్యాదగా నడచుకొందును.
నా దేశముపట్లను, నా ప్రజలపట్లను సేవానిరతి కలిగియుందునని ప్రతిజ్ఞ చేయుచున్నాను. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందమునకు మూలము.ప్రతీ రోజు ప్రతిజ్ఞ చదువుదాం దేశం పట్ల అభిమానాన్ని చాటుదాం

**కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి**
**జూన్ 10 పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతి సందర్భంగా 9848445134**

## నిత్యవసర ధరల పెంపుపై నేడు కలెక్టరేట్ ముట్టడి



**చట్టం రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ పెంచిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ నిత్యావసర ధరలు తగ్గించాలని నేడు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించాలని కోరుతూ పిలుపునిచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచడం వల్ల నిత్యావసర ధరలు పెరిగి సామాన్య ప్రజలపై భారం పడుతుంది అన్నారు. కేంద్ర ప్రభుత్వం ధరలు నియంత్రణ చేయడంలో విఫలమైంది అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య, జిల్లా సమితి సభ్యులు మిట్టపెల్లి పౌల్, కాదండీ సాంబయ్య, మామిడి గోపి నక్క వెంకటస్వామి, కౌన్సిలర్లు మద్దెల శంకర్, మినుగు ముని, మహిళ సమాఖ్య పట్టణ కార్యదర్శి గాజుల మనక్క మహిళ నాయకురాలు నారెడ్ల కల్పన, సిపిఐ నాయకులు ఈరవేణి రవీందర్ తదితరులు పాలుగోన్నారు

## పూరిగుడిసెలు లేని జిల్లాగా కామారెడ్డిని తీర్చిదిద్దాలి: కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వేగవంతం చేయాలి**



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి):** జిల్లాలో ఒక్క పూరిగుడిసె కూడా లేకుండా పూరిగుడిసెలు లేని జిల్లాగా కామారెడ్డిని తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ ఆదేశించారు. మంగళవారం రామారెడ్డి మండలంలోని వడ్డెర కాలనీని సందర్శించిన కలెక్టర్, పూరిగుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. అర్హులైన కుటుంబాలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

**కలెక్టర్ కీలక ఆదేశాలు:** రెండో విడత: రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పూరిగుడిసెలో ఉన్నవారిని గుర్తించి వారికి ఇళ్లు మంజూరు చేయాలి. రుణ సౌకర్యం: పేమెంట్ సమస్యలు తలెత్తితే APM ద్వారా లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలి. సమగ్ర సర్వే: నిజమైన లబ్ధిదారులను గుర్తించడంలో పొరపాట్లు జరగకుండా గ్రామ స్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలి. సాంకేతిక సహకారం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక, పరిపాలనా సహకారం అందించాలి. అర్హత కలిగిన ప్రతి కుటుంబం ప్రభుత్వ గృహ పథకాల ప్రయోజనం పొందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీ హౌసింగ్ విజయపాల్ రెడ్డి, ఎమ్మార్వో, సర్పంచ్ బండి ప్రవీణ్, ఎంపీడీవో నాగేశ్వర్ రావ్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**భద్రతా ఏర్పాట్లపై నిరంతర పర్యవేక్షణకు ఆదేశం**



**చట్టం కామారెడ్డి:** భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిర్వహించే త్రైమాసిక తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు, ఈవీఎం యంత్రాల భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. గోదాం తాళాల భద్రత, సీసీటీవీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాలు, భద్రతా సిబ్బంది విధులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. గోదాంలో భద్రపరిచిన యంత్రాల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు, గోదాం ఇన్‌ఛార్జ్‌లు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు



**చట్టం బిచ్కుంద :** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మండలం కందరపల్లిబిచ్కుంద రహదారిపై మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేసినారు. వాహనాల తనిఖీల సందర్భంగా ద్విచక్ర వాహనలు ,కార్లు,రవాణా వాహనాలు వాహనాలపై ఉన్న చాలాన్లు లేదా ఆర్ సి బుక్కు, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు తనిఖీలు చేశారు. వాహనదారులను అవగాహన కల్పిస్తూ ద్విచక్ర వాహనాదారులకు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాల్సిందిగా, కార్ డ్రైవర్లకు సీట్ బెల్ట్ పెట్టుకుని డ్రైవింగ్ చేయవలసిందిగా సూచించారు. ఇట్టి కార్యక్రమంలో రాధాకృష్ణ మహేందర్ రాజేష్ వెంకా గౌడ్ పాల్గొన్నారు.

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001.,
and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com